

రూ.1.21 కోట్ల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

- 75 కేసుల్లో 103 మంది నిందితుల అరెస్టు
- సీపీ శంఖబ్రతబాగ్చి

-8లో



హైడ్రో పవర్‌పై అపోహలు

ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మన్యానికి రెండు ప్రాజెక్టులు మంజూరు

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుజ్జెలి, చిట్టంవలస ప్రాంతాల్లో ఏర్పాటు

2,300 మెగావాట్‌ల సామర్థ్యం

- ఇతర ప్రాంతాల నుంచి నీరు...
- గ్రామాల ముంపు అపోహ మాత్రమే
- భారీగా పెరగనున్న ఉపాధి అవకాశాలు



హైడ్రో పవర్ ప్లాంట్ ఊహాచిత్రం..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో అదనపు విద్యుత్ అందుబాటులోకి రావడమే కాకుండా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'లో భాగంగా అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో రెండు హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లు చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

అనంతగిరి మండలం గుజ్జెలిలో 1,500 మెగావాట్లు, చిట్టంవలసలో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఇవి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కావడం గమనార్హం. అంటే వర్షాకాలంలో అందుబాటులో ఉన్న నీటిని ఉపయోగించుకుంటూ, అదనంగా ఉన్న నీటిని నిల్వ చేసుకుంటాయి. అవసరమైన చోట్ల డ్యామ్‌లు, రిజర్వాయర్లు నిర్మిస్తాయి. ఆ నీరు విద్యుదుత్పత్తికి సరిపోని సందర్భాల్లో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి పంపింగ్ చేసుకుంటాయి. అందుకే వీటిని పంప్డ్ హైడల్ ప్రాజెక్టులుగా వ్యవహరిస్తున్నారు.

ముంపు సమస్య అపోహ మాత్రమే

ఈ రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల కారణంగా హుకుంపేట, అరకులోయ, అనంతగిరి మండలాల్లోని ఎనిమిది పంచాయతీల్లో పలు గ్రామాలు ముంపునకు గురవుతాయని గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. అయితే ఇతర ప్రాంతాల నుంచి నీటిని రప్పించడం వల్ల ముంపు సమస్య ఎదురుకాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులన్నీ శాస్త్రీయంగా, ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో, పద్ధతి ప్రకారం చేపడతారని, అపోహలు పెంచుకోవద్దని సూచిస్తున్నారు. డ్యామ్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం నైపుణ్యం కలిగిన ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొంటున్నారు. వీటివల్ల పర్యావరణానికి గానీ, ఆయా ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులకు గానీ ఎటువంటి ఇబ్బందులు ఎదురు కావని భరోసా ఇస్తున్నారు. వేరే ప్రాంతం నుంచి నీటిని రప్పించడం వల్ల స్థానిక జల వనరులకు ముప్పు రాదని కూడా చెబుతున్నారు. ఈ విషయాల్లో ఆందోళన తగదని, స్థానిక గిరిజనులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామని అంటున్నారు. అంతేగాకుండా వీటివల్ల ఏజెన్సీలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విద్యుత్ ఆధారిత పరిశ్రమలను గిరిజనులు కూడా ఏర్పాటుచేసుకునే అవకాశం లభిస్తుందని అంటున్నారు. రెండు ప్రాజెక్టుల నిర్మాణంతో కొన్ని సంవత్సరాల పాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. అవి

... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ బస్సుల్లో 75 శాతం మహిళలే

- లెక్కలు తేల్చిన విశాఖ రీజియన్ అధికారులు
- స్త్రీశక్తి పథకం ప్రభావం
- రోజుకు సగటున 4.1 లక్షల మంది ప్రయాణం
- అందులో మహిళలు 3.07 లక్షల మంది...



ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

'స్త్రీశక్తి' పథకం అమలు తరువాత ప్రయాణికుల్లో 75 శాతం మంది మహిళలు ఉంటున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 22వ తేదీ వరకూ సగటున రోజుకు 4.1 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించగా, అందులో 3.07 లక్షల మంది మహిళలు ఉన్నట్టు గుర్తించారు. రీజియన్‌లో ప్రస్తుతం 780 బస్సులు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. ఇందులో గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్‌రైడర్, డాల్ఫిన్ క్రూయిజ్, డీలక్స్, ఆల్ట్రా డీలక్స్ సర్వీసులు 210 ఉన్నాయి. వీటిల్లో స్త్రీశక్తి పథకం వర్తించదు. ప్రయాణికులంతా తప్పనిసరిగా టికెట్ తీసుకోవాలి. దీంతో గతంలో ఆ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో కొందరు స్త్రీశక్తి పథకం వర్తించే బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక రీజియన్‌లో ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 570 నడుస్తున్నాయి. వాటిల్లో మహిళా ప్రయాణికుల

... మిగతా 6వ పేజీలో



వెలంపేట వద్ద నిలిచిన నీరు

కుండపోత

నగరంలో రెండు, మూడు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మల్కాపురంలో 6 సెంటీమీటర్ల వర్షపాతం
- నేడు, రేపు భారీ వర్షసూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం జిల్లాలో భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, వర్షం ప్రారంభమైంది. చాలా ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ గట్టి వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వన్‌టౌన్, పూర్ణామార్కెట్, జ్ఞానాపురం, రైల్వే న్యూకాలనీ, తదితర ప్రాంతాల్లో నీరు భారీగా రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో అనేకచోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. ములగాడ, పెదగంట్యాడ, ఆనందపురం మండలాల్లో పెద్దఎత్తున వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వర్షానికి తోడు ఈదురుగాలులు వీచాయి.



మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్కాపురం జీవీఎంసీ స్కూల్ వద్ద 61.75, ఆనందపురం మండలం కణమాంలో 52, పెదగంట్యాడ మండలం మదీనాబాగ్‌లో 50.75,

... మిగతా 6వ పేజీలో

నైట్ ఫుడ్‌కోర్టు పేరుతో వైసీపీ రాజకీయం

- మళ్లీ వసూళ్లకు వ్యూహం
- వ్యాపారులతో నేతల సమావేశం
- కూటమికి చెందిన కొంతమంది నేతల సహకారం



నైట్ ఫుడ్‌కోర్టులో దుకాణాల తొలగింపు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు సేవ్ అర్బన్ గ్రీన్ స్పేసెస్) పేరుతో జీవీఎంసీ అధికారులు నగరంలో రోడ్లు, పార్కులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే పాత జైలురోడ్డులో అనధికారికంగా కొనసాగుతున్న నైట్ ఫుడ్‌కోర్ట్‌ను తొలగించారు. దీనిపై కొందరు ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు వచ్చినాసరే అధికారులు ముందుకువెళ్లారు. ఫుడ్‌కోర్టును తొలగించడాన్ని నిరసిస్తూ కొందరు వ్యాపారులు ఆం దోళన నిర్వహించారు. దీనిని తమకు అనుకూలంగా మార్చుకుని జేబులు నింపుకునేందుకు వైసీపీ నేతలు కొందరు వ్యూహం రూపొందించారు. వ్యాపారులకు మద్దతు పేరుతో వారితో కలి సి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించారు. వ్యాపారులంతా తమ వెంట నడిస్తే జీవీఎంసీ అధికారులను కలిసి దుకాణాలను తిరిగి అక్కడే ఏర్పాటుచేసుకునేందుకు

... మిగతా 6వ పేజీలో

ఫీజు పెండింగ్

పేరుకుపోతున్న బకాయిలు

- డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మా, ఐటీఐ, ఇంటర్ విద్యార్థులకు పెండింగ్
- గత (2024-25) విద్యా సంవత్సరంలో ఒకే క్వార్టర్ ఫీజు మాత్రమే చెల్లింపు
- మొత్తం నాలుగు క్వార్టర్ల ఫీజులు రావలసి ఉండడంతో కళాశాలల యాజమాన్యాల ఆందోళన
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులపై భారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తోంది. కోర్సు, కాలేజీని బట్టి ఫీజులను నిర్ణయించి ఏడాదిలో నాలుగు విడతలుగా యాజమాన్యాలకు చెల్లించాలి. అయితే, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక క్వార్టర్ ఫీజును మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. మరో మూడు క్వార్టర్లు, అలాగే, 2025-26 విద్యా సంవత్సరానికిగాను పూర్తయిన ఒక క్వార్టర్‌కు సంబంధించిన ఫీజులను చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో సుమారు 57 వేల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాల్సి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే ఐదు క్వార్టర్లకు స్కాలర్‌షిప్‌ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. విద్యార్థి చేస్తున్న కోర్సును బట్టి ఏడాదికి రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకూ స్కాలర్‌షిప్ ఇస్తోంది. ఇప్పటివరకూ ఒక క్వార్టర్‌కు సంబంధించిన



స్కాలర్‌షిప్‌ను మాత్రమే చెల్లించినట్టు విద్యార్థులు చెబుతున్నారు.

భారాన్ని మోపిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపునకు 'విద్యాదీవెన', 'వసతి దీవెన' అని పేర్లు పెట్టి, విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించింది. అయితే, ఒక్క ఏడాది మినహా తరువాత ఏటా ఒకటి, రెండు క్వార్టర్ల ఫీజు బకాయిలు పెడుతూ వచ్చింది. 2019 ఎన్నికల నాటికి మూడు నుంచి ఐదు క్వార్టర్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను బకాయి పెట్టింది. ఈ నేపథ్యంలో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులతో యాజమాన్యాలు బలవంతంగా డబ్బులు కట్టించుకున్నాయి. పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లిస్తేనేగానీ సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి మరీ ఫీజులను చెల్లించాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో సుమారు 80 వేల మందికిపైగా విద్యార్థులపై గత వైసీపీ ప్రభుత్వం వేలాది రూపాయల భారాన్ని మోపింది.

చెల్లించేందుకు సన్నద్ధం

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వ నిర్ణయాలను

... మిగతా 6వ పేజీలో

వీధి వ్యాపారుల సర్వే పూర్తి

- ఎనిమిది జోన్‌ల పరిధిలో 18,041 మంది ఉన్నట్టు గుర్తింపు
- వారిలో గుర్తింపు కార్డులు పొందినవారు 6,755 మంది మాత్రమే
- అందరికీ దుకాణాలు పెట్టేందుకు 21 టౌన్ వెండింగ్ జోన్‌లు గుర్తింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రోడ్ల మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులను లెక్కించేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన సర్వే పూర్తయ్యింది. ఎనిమిది జోన్‌ల పరిధిలో 18,041 మంది రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నట్టు యూసీడీ అధికారుల సర్వేలో తేలింది. వీరిలో స్టేట్ స్ట్రీట్ వెండింగ్ జోన్ యాక్ట్ ప్రకారం జీవీఎంసీకి డబ్బులు చెల్లించి గుర్తింపు కార్డులు పొందినవారు 6,755 మందేనని గుర్తించారు. గుర్తింపు కార్డులు పొందని వారికి కూడా కొత్తగా ఏర్పాటుచేసే స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. నగరంలో ఎనిమిది జోన్‌ల పరిధిలో స్ట్రీట్ వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే చేశారు. ఒక్కో జోన్‌లో మూడేసి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు, జనజీవనానికి ఇబ్బందిలేకుండా దుకాణాలు ఏర్పాటుచేసుకోవచ్చునని ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతానికి

... మిగతా 6వ పేజీలో



ఆదిలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి

ఆదిలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనం

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు మంగళవారం ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం అమ్మవారు ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణం పనులు పూర్తయిన దృశ్యం

వల్లభాయ్ పటేల్ వంతెన రెడీ

- 2 నుంచి రాకపోకలకు పోర్టు అధికారుల గ్రీన్‌సిగ్నల్
- ప్రస్తుతానికి ఒక వైపు ప్రయాణానికి మాత్రమే వీలు
- పారిశ్రామికప్రాంత వాసులకు ఊరట

మల్కాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

నేవల్ డాక్‌యార్డు సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణం పూర్తయింది. దీంతో అక్టోబరు రెండో తేదీ నుంచి వంతెనపై ప్రయాణానికి పోర్టు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో కొత్త వంతెన నిర్మాణానికి వీలుగా ఏడాదిన్నర కిందట మూసేశారు. సుమారు రూ.26 కోట్లతో పనులు చేపట్టారు.

వంతెన నిర్మాణాన్ని గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేపట్టింది. సముద్రంపై ఆరుమీటర్ల ఎత్తున దీనిని నిర్మించారు. ఉప్పునీటి ప్రభావంతో వంతెన కింది భాగం

... మిగతా 6వ పేజీలో

సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ కేంద్రంగా ఈసీబీసీ భవనం

- ఇన్నోవేషన్, స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సాగర్‌నగర్‌లో నిర్మించిన ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) భవనాన్ని 'ఎనర్జీ ట్రాన్సిషన్ సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్'గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. విద్యుత్ పంపిణీ సంస్థలకు శిక్షణ కార్యక్రమాల కోసం ఈపీడీసీఎల్ ఈ భవనాన్ని రూ.13.5 కోట్లతో నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.5 కోట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ గ్రాంటుగా సమకూర్చింది. ఇప్పుడు ఈ భవనాన్ని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌గా మార్చారు. దీని నిర్వహణకు అయ్యే మొత్తం వ్యయాన్ని రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో భరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఒక సొసైటీని ఏర్పాటు చేసి, కమిటీ ఏర్పాటుచేయాలని సూచించారు. దానికి ఇంధన శాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా, ఈపీడీసీఎల్ సీఎండీ వైస్ ఛైర్మన్‌గా, మిగిలిన డిస్కమ్‌ల సీఎండీలు సభ్యులుగా ఉంటారు. ఈపీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ మెంబర్ కన్వీనర్‌గా, ఏయూ, ఐఐఎం, ఐఐపీఈ, డీఎస్ఎన్ఎల్‌యూ వంటి విద్యా సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.



సాగర్‌నగర్‌లోని ఈసీబీసీ భవనం

ఇదీ లక్ష్యం

సస్టెయినబుల్ ఎనర్జీ కోసం

... మిగతా 6వ పేజీలో

అడవివరం భూములకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మజ్జి సూరిబాబు

సింహాచలం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అడవివరంలో గ్రామకంఠం భూములకు తక్షణం రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని కోరుతూ 98వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు మజ్జి సూరిబాబు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి ద్వారంపూడి శ్రీనివాస్‌తో కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ పురుషోత్తపురం, వేపగుంట, చీమలాపల్లి, వెంకటాపురం గ్రామాల్లో గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, కానీ అడవివరంలో ఉన్న గ్రామకంఠం భూములకు మాత్రం రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీవో నంబరు 296ను అనుసరించి సింహాచల నగర్‌లోని భూములకు రిజిస్ట్రేషన్లు హక్కులు కల్పించాలని కోరారు. తమ అభ్యర్థనలకు కలెక్టర్ సానుకూలంగా స్పందిచినట్టు సూరిబాబు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



కొయ్యి గౌరి

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామానికి చెందిన వివాహిత కొయ్య గౌరి (29) కనిపించడం లేదంటూ మంగళవారం సాయంత్రం పోలీసులకు ఈమె భర్త అప్పలగోవింద ఫిర్యాదు చేశారు. వీరికి వివాహమై 8 సంవత్సరాలు అయిందని, ఒకసారి భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోతే పెద్ద మనుషులు సర్దిచెప్పి తీసుకుని వచ్చారని పోలీసులు చెప్పారు. ఈ నెల 21న ఉదయం తొమ్మిది గంటలకు ఇంటి నుంచి తగరపువలస వెళతానని వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని చెప్పారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భీమిలి పోలీసులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం

» బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు

పద్మనాభం-రూరల్,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు, మినహాయింపుతో పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు తెలిపారు. జీఎస్టీ తగ్గింపువల్ల పేద, మధ్య తరగతి వర్గాలు వినియోగించే నిత్యావసరకుల ధరలు తగ్గాయన్నారు. మధ్య తరగతి వినియోగదారులు కొనుగోలు చేసే 375 రకాల ఉత్పత్తులపై పన్నూ రేట్లు తగ్గించడం వినియోగదారులకు కొంత ఊరట లభిస్తోందన్నారు. ప్రధాన మంత్రి మోదీ తీసుకున్న నిర్ణయంతో దేశం ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తుందన్నార

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

» జేఎన్టీయూ వీసీ రాజ్యలక్ష్మి



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

ఆనందపురం,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ఆచార్య రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఇద్దరు అధాయపకులకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ కంపెటెన్సీస్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జాతీయ స్థాయిలో అవార్డు లభించిన సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.శివప్రసాద్ ఐఐఈ లీడ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఇ.నవీన్ మెంటర్‌గా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు ఈ అవార్డులు అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న అధ్యాపకులు ఇరువురూ మాట్లాడుతూ ఈ అవార్డు తమకు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవీనవరాత్రి పూజలు




పద్మనాభంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ఎండాడ: గీతంలో బ్రహ్మచారిణి అవతారంలో అమ్మవారు



సింహాచలంలో పంచముఖి గాయత్రిదేవిగా దుర్గమ్మ



తాటితూరులో సరస్వతిదేవి

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరులో దుర్గా నవరాత్రుల సందర్భంగా సరస్వతీదేవి ఉత్సవాలు మంగళవారం పూజలు చేసి గురువారం నుంచి ప్రారంభించనున్నారు. చదువుల సరస్వతిగా పేరున్న సరస్వతి దేవి విగ్రహానికి ఈ గ్రామానికి చెందిన శాలివాహన (కుమ్మరి) పేరుతో ఉన్న సామాజికవర్గం వారు ఏర్పాటు చేశారు. తర్వాత ఈ విగ్రహానికి పూజలు చేయడానికి ఉత్సవాలు నిర్వహించడానికి శ్రీ శాలివాహన యువజన సేవాసంఘం పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసి రిజిస్టరు కూడా చేయించారు. ఈ గ్రామంలో సరస్వతి దేవి విగ్రహం వద్ద పిల్లల అక్షరాభ్యాసాలు చేస్తుంటారు. ఈ విగ్రహాన్ని చూసిన తర్వాత ఈ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కూడా మరొక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఉత్సవాలు

సరస్వతిదేవి ఉత్సవాలు లాంచనంగా ప్రారంభించారు. ఈ నెల 26 శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు మహిళల ముగ్గులు పోటీలను నిర్వహిస్తారు. 29న (సోమవారం) ఉదయం అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం అయినందున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి మందిరం వద్ద అన్న సంతర్పణ చేస్తారు. అనంతరం పూలతో ప్రత్యేక అలంకరణ చేసి తాటితూరు పురవీధుల్లో ఊరేగింపు జరుపుతారు. అక్టోబర్ 1 (బుధవారం) సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి గుడి వద్ద దీపారాధన జరుగుతుంది. 2వ తేదీ (గురువారం) సాయంత్రం అమ్మవారిని మరోసారి ఊరేగించి, తాటితూరు వద్ద ఉన్న గోస్తనీలో నిమజ్జనం చేస్తారు. దీంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

పద్మనాభంలో..

పద్మనాభం, (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజైన మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మనాభం, మద్ది, విజయానందపురం, పొట్నూరు. రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవికి విశేష అర్చనలు చేసి, సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణ, సామూహిక కుంకుమార్చనలు చేశారు. భవానీ మాలాధారులు కూడా అమ్మవారికి పూజలు నిర్వహించారు. మద్ది సాగర దుర్గ ఆలయం, గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలోను శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

గాయత్రిదేవి అలంకరణలో

కొమ్మాది, (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లో భాగంగా చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, సహస్రపుష్పార్చనలు, హోమం నిర్వహించారు.

బ్రహ్మచారిణి అలంకరణలో

ఎండాడ, (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రులను పురస్కరించుకుని 8వ వార్డు ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయం అమ్మవారు మంగళవారం గాయత్రి దేవి అలంకరణలో భక్తుకలు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సంపెంగ, చామంతి పూలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జిమ్‌సర్‌లో..

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ప్రాంగణంలో ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంగళవారం బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు.

పంచముఖి గాయత్రి దేవిగా

సింహాచలం, (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం 98వ వార్డు విజిని గిరిపాలెంలో ఉమాచంద్రమౌళేశ్వర ఆలయంలో ఉమాదేవి పంచముఖ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు ఉదయ్‌కృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింహవల్లీ తాయార్, చతుర్భుజి తాయార్ అమ్మవార్లను సకలాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా మార్గం పొడవునా ప్రత్యేక నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలిచ్చారు.

న్యాయం జరిగే వరకు భూములు అమ్మనివ్వం

» జేసీఎల్‌తో చర్చల్లో ఐఎన్టీయూసీ నేతల అల్టిమేటం



జాయింట్ లేబర్ కమిషనర్‌తో చర్చలు జరుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

తగరపువలస, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస జూట్ మిల్లు మూతపడిన తర్వాత యాజమాన్యం కార్మికులకు చెల్లించవలసిన కోట్లాది రూపాయల పరిహారాలు చెల్లించడం లేదు. ఈ విషయాన్ని గత వారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వద్ద యాజమాన్య ప్రతినిధులు ప్రస్తావించగా, చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తగరపువలస ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టీయూసీ) నాయకులు జాయింట్ లేబర్ కమిషనర్ (జేసీఎల్) రామారావుతో మంగళవారం సమావేశమయ్యారు. సమస్యలపై చర్చించారు. జూట్‌మిల్లు యాజమాన్యం తనకున్న కోట్లాది రూపాయల విలువైన భూములు అమ్మకాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కోర్టులో అటాచ్‌మెటంట్ తీసుకొని వచ్చామన్నారు. మిల్లు యాజమాన్యం కార్మికులకు వారికి ఇవ్వాల్సిన పరిహారాలు అందించేంత వరకు అటాచ్‌మెంట్‌ని తాము తొలగించమని అన్నారు. కార్మికుల పేర్లు, వారికి రావాల్సిన పరిహారాల లిస్టులు వంటివి కార్మిక సంఘాల నుంచి రాలేనందువల్ల పరిహారాల చెల్లింపు జాప్యం జరిగిందని మిల్లు యాజమాన్య ప్రతినిధి లలిత్ మోహన్ స్పష్టం చేశారు. దీనిపై కార్మిక సంఘం నాయకులు స్పందిస్తూ ఈ జాబితాలను ఇతర యూనియన్లతో చర్చించి వారం రోజుల్లో అందజేస్తామని చెప్పారు. లిస్టులలో కార్మికులకు చెల్లించవలసింది ఎంత? యాజమాన్యం ఎంత చెల్లిస్తుంది? అనే విషయాలను సరిచూసుకొని, అప్పుడు యూనియన్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే గంటా సమక్షంలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్మికులకు కార్మిక శాఖ నుంచి రావల్సిన పరిహారాలు చెల్లించాలని జెసిఎల్‌ని కోరారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ అధ్యక్షులు కేవీ నర్సింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు సరగడ సూరిబాబు, కొయ్య గురువులు, పి.నర్సింగరావు, వి.గోవింద్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రామాయణ పారాయణం

సింహాచలం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో రామాయణ పారాయణాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏటా ఆశ్వీయజ మాస శుక్లపక్ష పాడ్యమి నుంచి దశమి వరకు అప్పన్న ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. అదే క్రమంలో ఈనెల 22న పాడ్యమి నుంచి అప్పన్న ఆలయ హంసమూలాను అనంతాసనంపై పండితులు ఇల్లింద నరసింహాచార్యులు పారాయణం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం ఆలయ అర్చకులు నీరాజనాలిచ్చారు.

రామాలయంలో స్వచ్ఛభారత్

కొమ్మాది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న సేవా పక్వాడ్‌లో భాగంగా 6వ వార్డు పీఎం.పాలెం అర్బన్ ప్రాథమిక వైద్యశాల, రామాలయంలో ఎండాడ మండల బీజేపీ అధ్యక్షుడు చోడవంర నాగరాజు మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్.దానేశ్, బీజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరిగంటి మాధవరావు, విశాఖ జిల్లా కోర్ కమిటీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు కేయస్‌పీ.చక్రవర్తి పాల్గొన్నారు.

నైట్ ఫుడ్‌కోర్టు పేరుతో వైసీపీ రాజకీయం!

... 5వ పేజీ తరువాయి

అనుమతి ఇచ్చేలా ఒత్తిడి చేస్తామంటూ హామీ ఇచ్చారు. వైసీపీ నేతల మాటలు నమ్మిన కొందరు వ్యాపారులు రెండు రోజుల కిందట సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయానికి వెళ్లారు. కనీసం నోటీసు ఇవ్వకుండా దుకాణాలను ఎలా తొలగిస్తారంటూ అక్కడ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును వైసీపీ నేతలు ప్రశ్నించారు. పండుగలోగా కౌన్సిల్/స్టాండింగ్ కమిటీ ఆమోదంతో అక్కడే ఫుడ్‌కోర్టును తిరిగి ఏర్పాటుచేయించాలని డిమాండ్ చేశారు. జోనల్ కమిషనర్‌తో బలవంతంగా హామీ పత్రం రాయించి వ్యాపారులకు అందజేసేలా చేశారు. కూటమిలోని కొందరు ప్రజా ప్రతినిధులు కూడా ఫుడ్‌కోర్టులో వ్యాపారులకు అనుకూలంగా ఉండడంతో వారితో లోపాయికారీగా వైసీపీ నేతలు మాట్లాడి, వారి సూచన మేరకు వ్యాపారులను వెంటబెట్టుకుని జోనల్ కార్యాలయానికి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. జోనల్ కమిషనర్‌కు కూటమి నేతలు కూడా ఫోన్ చేసి వైసీపీ నేతలు కోరినట్టు హామీ పత్రం రాసివ్వాలని, లేనిపక్షంతో తమ సత్తా ఏమిటో చూపిస్తామని బెదిరించారని, అందువల్లే ఆయనకు అధికారం లేకపోయినాసరే హామీ పత్రం ఇచ్చినట్టు చెబుతున్నారు. దుకాణాల ఏర్పాటు జరిగిన తర్వాత తమకు వ్యాపారుల నుంచి తలా ఇంత అని చెప్పి వసూలుచేసి ఇవ్వాలని...అక్కడ నాలుగైదు దుకాణాలు కలిగిన ఇద్దరు వ్యాపారులతో వైసీపీ నేతలు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీజు పెండింగ్

... 5వ పేజీ తరువాయి

సమీక్షించుకుంటూ విధానాల్లో మార్పులను తీసుకుంటూ వచ్చింది. వైసీపీ సర్కార్ తెచ్చిన విద్యా, వసతి దీవెనల స్థానంలో మళ్లీ స్కాలర్‌షిప్, ఫీజు లను గతంలో మాదిరిగానే నేరుగా కాలేజీలకు చెల్లించే విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో బకాయిలు ఉన్నప్పటికీ విద్యార్థులపై ఒత్తిడి పెట్టలేని పరిస్థితి యాజమాన్యాలకు ఏర్పడింది. పెండింగ్‌లో బకాయిలను విడుదల చేయాలని కాలేజీ యాజమాన్యాలు కొద్దిరోజులుగా ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో దసరా తరువాత తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి వివిధ పద్ధతుల్లో తీసుకువెళ్లాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా వాట్సాప్ ద్వారా విజ్ఞాపనలు పంపించడం, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం, ఆ తరువాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతులు సమర్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోనట్టయితే కాలేజీలను మూసి సమ్మె చేపడతామని హెచ్చరిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అధికారులను వివరణ కోరగా..బకాయిలను విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

వల్లభాయ్ పటేల్ వంతెన రెడీ

... 5వ పేజీ తరువాయి

తుప్పు పట్టకుండా ప్రత్యేక పెయింటింగ్స్ వేశారు. వంతెన కాలపరిమితి 60 ఏళ్లుగా నిర్ధారించారు. మద్రాస్ ఐఐటీ (ప్రాజెక్ట్ మోనటరింగ్ కమిటీ) పర్యవేక్షణలో పనులు సాగాయి. దీని డిజైన్‌ను కూడా వారే రూపొందించారు. వంతెన పొడవు 330 మీటర్లు, వెడల్పు 10.5 మీటర్లు. ఇందులో ఏడు మీటర్లు వాహనాలు వెళ్లేందుకు, రెండువైపులా అడుగున్నర చొప్పున ఫుట్‌పాత్ నిర్మించారు. 33 మీటర్ల దూరాన్ని పరిమాణంగా తీసుకుని మొత్తం 10 పిల్లర్లు నిర్మించారు. వంతెనపై 15 విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు.

ఒకవైపు మాత్రమే అనుమతి

ప్రస్తుతం వంతెనపై ఒకవైపు మాత్రమే అదీ తేలికపాటి వాహనాలకు అనుమతిస్తారు. పారిశ్రామిక ప్రాంతం నుంచి కాన్వెంట్ జంక్షన్ వైపు వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉంది. తిరిగి వచ్చేవారు కాన్వెంట్ జంక్షన్-షీలానగర్ రోడ్డులో మారుతి సర్కిల్ నుంచి పారిశ్రామిక ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ సాగరమాల పేరుతో హైవే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయినన తరువాత వంతెన పైనుంచి ఇరువైపులా రాకపోకలకు అనుమతిస్తారు.

‘హైడ్రో పవర్’పై అపోహలు

... 5వ పేజీ తరువాయి

పూర్తయ్యాక నైపుణ్యం కలిగిన వారికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. చదువుకున్న గిరిజన యువతకు విద్యుత్ ప్రాజెక్టుల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇంకా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి. వాటిలోను ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపే ప్రాజెక్టులుగా వీటికి గుర్తింపు లభించనుంది. ప్రభుత్వం గిరిజనులకు ఎటువంటి నష్టం లేకుండా, వారికి మేలు జరిగే విధంగా ఈ ప్రాజెక్టుల పనులు చేపట్టాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో సదస్సులు నిర్వహించి వారిలో అపోహలు తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

వీధి వ్యాపారుల సర్వే పూర్తి

... 5వ పేజీ తరువాయి

21 చోట్ల వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. ప్రభుత్వ అనుమతి రాగానే పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మరికొన్నిచోట్ల కూడా వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు. కాగా నగరంలో రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రధాన కూడళ్లలో ఆక్రమణలను తొలగించి ప్రజలకు రక్షణ, ఉత్తమ జీవన పరిస్థితులను కల్పించేందుకే ఆపరేషన్ లంగ్స్‌కు శ్రీకారం చుట్టామని యూసీడీ పీడీ సత్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిగురించి వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాపారుల సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి వారి జీవనోపాధికి ఇబ్బంది కలుగకుండా జీవీఎంసీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆక్రమణలు తొలగింపుపై అపోహలు, వదంతులు, అసత్యప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. అర్హులైన వ్యాపారులందరికీ స్ట్రీట్ వెండింగ్‌జోన్ చట్టం ప్రకారం స్వేచ్ఛగా వ్యాపారం సాగించుకునే వెసులుబాటు కల్పించేందుకు కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రణాళికలు రూపొందించారని వివరించారు.

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రంగా ఈసీబీసీ భవనం

... 5వ పేజీ తరువాయి

ఈ ఎక్సలెన్స్ సెంటర్ నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేస్తుంది. పరిశోధనలకు పెద్దపీట వేస్తుంది. పారిశ్రామిక అవసరాలకు తగినట్టుగా స్కిల్ డెవలప్‌మెంట్, కెపాసిటీ బిల్డింగ్ కోసం కార్యక్రమాలు చేపడుతుంది. విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రజా సంఘాల మధ్య వారధిగా ఉంటుంది. డేటా ఆధారంగా పైలట్ ప్రాజెక్టులు చేపడుతుంది. ఎనర్జీ రంగంలో ఇంకుబేషన్ సెంటర్లను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ, స్టోరేజ్ విధానాలను ఇంటిగ్రేట్ చేయడానికి యత్నిస్తుంది. రూఫ్ టాప్ సోలార్, మైక్రో గ్రిడ్లు, ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్‌కు మౌలిక వసతులు, గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టులు, అధ్యయనాలు చేపడుతుంది. ఉద్యోగ అవకాశాలు పెంచుతుంది.

ఆర్టీసీ బస్సుల్లో 75 శాతం మహిళలే

... 5వ పేజీ తరువాయి

సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఆగస్టు 15కు ముందు రీజియన్‌లో రోజువారీ సగటున 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. అందులో మహిళలు 1.5 లక్షలు, పురుషులు 1.6 లక్షల మంది ఉండేవారు. మహిళల కంటే పురుషులు పది వేల మంది ఎక్కువగా ప్రయాణించేవారు. స్త్రీశక్తి అమలైన తరువాత సగటున రోజుకు 4.1 లక్షల మంది ప్రయాణిస్తుండగా, అందులో 3.07 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తుండగా, పురుషుల సంఖ్య 1.03 లక్షలకు తగ్గినట్టు అధికారులు లెక్కలు తేల్చారు.

బీమా పథకాలపై అవగాహన తప్పనిసరి

» రిజ్వర్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సీఎం.మహాన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం మహాన

పద్మనాభం-రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ బీమా పథకాలపై అవగాహన కల్పించుకోవాలని రిజ్వర్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సీఎం మహాన కోరారు. మంగళవారం పెంట గ్రామంలో అనంతవరం స్టేట్ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో బీమా పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన మహాన మాట్లాడుతూ గ్రామస్థాయిలో జన సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామిని, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.బీఐ ఏజీఎం రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సకాలంలో ప్రీమియం చెల్లించి ఆర్థిక లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాఘవేంద్ర, గ్రామ సర్పంచ్ బొదల పావని, అనంతవరం బ్యాంచ్ మేనేజర్ బెన్ యోనా తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగి గ్రామంలో

ప్రజల సురక్షితను కాంక్షించే ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినాయోగం చేసుకోవాలని ఆర్బీఐ జనరల్ మేనేజర్ ఆర్కే మహాన కోరారు. మంగళవారం పాండ్రంగి గ్రామంలో అల్లూరి జనన గృహం ఆవరణలో పద్మనాభం యూనియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డి ఎం.శ్రీనివాస్, డిప్యూటీ రీజనల్ హెడ్ పి.రాజేష్, పాండ్రంగి పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఎం.శ్రీనివాసరావు, స్థానిక యూనియన్ బ్యాంకు సిబ్బంది, మహిళా ఖాతాదారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కొమ్మాది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రమేశ్ అన్నారు. పీఎం పాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా ఆయన ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవల గురించి పేషెంట్లను, టీబీ స్క్రీనింగ్ వివరాలు వైద్యులను అడిగితెలుసుకున్నారు. క్యాంప్‌లో 260 మంది పేషెంట్లు పాల్గొనగా అందులో 70 మంది టీబీ స్క్రీనింగ్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, డాక్టర్ సృజన, వార్డు టీడీపీ అధ్యక్షుడు దానరి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రే అవకాశాన్ని వియోగించుకోవాలి

» వ్యవసాయ శాఖ ఏడీ విజయప్రసాద్

భీమునిపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరి పంటలో ఒకే దఫా పురుగు మందులు పిచికారీ చేయడానికి డ్రోన్ స్ప్రే విధానాన్ని సద్వినియోగపర్చుకోవాలని రైతులను భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి విజయప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని కాపులుప్పాడలో 'పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతుల పొలాల్లోకి వెళ్లి స్వయంగా పంటలను పరిశీలించి, ఆకు ముడత తెగులు ఉన్నట్టు గుర్తించారు. దీని నివారణకు రైతులకు పురుగు మందులు వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.శివకోమలి మాట్లాడుతూ వరి పంట పిలక దశలో ఉన్నందున ఆకుముడత నివారణకు ఒక ఎకరానికి క్లోరోపైరీ ఫాస్ 400 మిల్లీలీటర్ల మందును 300-400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, వరి పంట చిరు పొట్టదశలో ఆకు ముడత సోకితే ఒక ఎకరానికి 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా ఎసెఫేట్ 400-500 గ్రాములు, 300-400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏడీ విజయప్రసాద్ వివరించారు. అంతేకాకుండా పంటలో జింక్ లోపం కూడా ఉందని దీనికి చిటలేటెడ్ జింక్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీనికి పది నుంచి 15 ఎకరాల పంటకు ఒకేసారి పురుగు మందు పిచికారి చేయడానికి తక్కువ ఖర్చుతో డ్రోన్ తో స్ప్రే చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ డ్రోన్ విధానంతో సమయాన్ని ఆదా చేసుకోవడమే గాక, పురుగు మందులకు అయ్యే ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కాపులుప్పాడ రైతులు వేముల రమణ, దుంప సత్యం, శీరపు రమణ, ఎరుసు అప్పలకొండ, గుడ్ల అప్పలకొండ, గుడ్ల శ్రీరామ్ తదితర రైతులు పాల్గొన్నారు. వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలకు రైతులు సంతృప్తి చెందారు.

గ్రంథాలయాల ఏర్పాటు హర్షణీయం

» ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు

మధురవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న నియోజకవర్గానికి ఒక గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించడం అభినందనీయమని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదిర్శ ఇమంది పైడిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయాలు సమాజచైతన్యానికి, విజ్ఞానానికి పట్టుకొమ్మలని, అలాంటి వాటిని ప్రభుత్వం గుర్తించి ఏర్పాటు చేయడం హర్షణీమని ప్రకటనలో పేర్కొన్నారు.

రంజీ ట్రోఫీకి 31 మంది ప్రాబబుల్స్ ఎంపిక

విశాఖపట్నం-స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రంజీ ట్రోఫీ కోసం ఆంధ్ర సీనియర్ జట్టుకు 31 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. బుధవారం నుంచి విజయనగరంలోని ఏసీఏ అకాడమీలో కొత్త కోచ్ గ్యారీ స్టెడ్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం తుది జట్టును ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం ప్రకటించిన ప్రాబబుల్స్‌లో కేఎస్ భరత్, రేవంత్‌రెడ్డి, మహీప్‌కుమార్, అభిషేక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఎం.హర్షవర్ధన్, ఎస్‌కే రషీద్, హేమంత్‌రెడ్డి, రిక్కీబుయ్, కరణ్ షిండే, అశ్విన్ హెబ్బర్, యర్రా సందీప్, కేవీ శశికాంత్, ఎ.బ్రహ్మతేజ, పి.తపస్వి, జీఎస్‌పీ తేజ, సీహెచ్ స్టీఫెన్, వై.పృథ్వీరాజ్, పి.సత్యనారాయణరాజు, కె.సుదర్శన్, కె.సాయితేజ, సాకేత్‌రామ్, మునిష్‌వర్మ, సౌరభ్‌కుమార్, ఎస్.ఆశిష్, ఎం.అంజనేయులు, టి.విజయ్, టి.భరత్, ఎ.లలిత్‌మోహన్, జి.మనీష్, దీపన్ సాయినాథ్ ఉన్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం భక్తుల కనుల పండుగగా సాగింది. ఈ సందర్భంగా మంగళవారం వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజు స్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు.

కుండపోత

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం మండలంలోని గోస్తనీ పంప్ హౌస్ వద్ద 41.5, గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద 35.5 మిల్లీ మీటరు వర్షపాతం నమోదైంది. బుధవారం నుంచి మరో మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. శివారు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ నెల 25 నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

సూపర్ బజారు పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూపర్ బజారు (విశాఖపట్నం కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్) పర్సన్ ఇన్‌చార్జిగా ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కొనసాగుతున్నారు. ఈ పదవిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంవీపీ కాలనీలో ఆపరేషన్ లంగ్స్

- భారీగా బడ్డీలు తొలగించిన జీవీఎంసి
- స్వచ్ఛందంగా తొలగించిన కొందరు వ్యాపారులు
- జీవనోపాధి కోల్పోయామంటూ పలువురి ఆవేదన



బడ్డీలు తొలగించిన తర్వాత విశాలంగా కనిపిస్తున్న రోడ్డు



వ్యాపారులు సురక్షిత ప్రదేశానికి తరలించుకు వెళుతున్న బడ్డీలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు సేవ్ అర్బన్ గ్రీన్ స్పేసెస్) పేరిట నగరంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపులో భాగంగా మంగళవారం ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బంది బడ్డీలను తొలగించారు. కొన్నింటిని వ్యాపారులే స్వచ్ఛందంగా లారీలపై తరలించుకున్నారు.

బడ్డీల నిలయంగా మారిన ఎంవీపీ కాలనీలో ప్రతి కూడలిలోనూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ దుకాణాలే ఎక్కడికక్కడే దర్శనమిస్తాయి. ప్రధాన రహదారులతో పాటు వాటిని ఆనుకుని ఉన్న కాలనీల్లోని అంతర్గత రహదారుల్లోనూ ఈ ఆక్రమణలు విస్తరించాయి. అల్వార్‌దాస్ మైదానం ఆనుకుని డబుల్ రోడ్డుపై ఫుట్‌పాత్ పూర్తిగా బడ్డీలతోనే నిండి ఉండేది. అలాగే టాస్క్‌ఫోర్స్ సర్కిల్ నుంచి ఇటు ఉషోదయ కూడలి వరకూ, అటు డీఆర్‌డీఏ కూడలి వరకూ ఉన్న బడ్డీలన్నీ తొలగించారు. అల్వార్‌దాస్ కళాశాల మైదానానికి ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఉన్న అముల్ బడ్డీని మాత్రం తొలగించకుండా వదిలేయడంపై అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరి జీవనోపాధి ఈ బడ్డీలపైనే ఆధారపడి ఉండడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడ్డీలకు యజమానులు వేరే వారు ఉన్నా, వాటిని అద్దెకు తీసుకుని చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి సాగించే వారికి ఈ పరిస్థితి షాక్‌కు గురి చేసింది. ఒక్కసారిగా ఉపాధి కోల్పోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. కొందరు యజమానుల వద్ద దినసరి వేతనంకు పనిచేసే వారు కూడా ఉపాధి కోల్పోయారు. దీనిపై అధికారుల కూడా ప్రత్యేకించి కొన్ని స్థలాలు కేటాయించి, అద్దె ప్రాతిపదికన అయినా వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని, ఈ విషయమై యుద్ధప్రాతిపదికన నిర్ణయం తీసుకోవాలని చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. అయితే తొలగింపు తర్వాత మళ్లీ బడ్డీలు రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంటుందని గుర్తు చేస్తున్నారు.



శివాజీపార్క్ రోడ్డులో తొలగిస్తున్న దుకాణాలు

దుకాణాల తొలగింపులో ఉద్రిక్తత

రోడ్డున పడతామంటూ చిరు వ్యాపారులు అడ్డుకునే యత్నం

మద్దిలపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు సేవ్ అర్బన్ గ్రీన్ స్పేసెస్)లో భాగంగా శివాజీపార్కురోడ్డులో మంగళవారం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దుకాణాలు తొలగించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఫుట్‌పాత్ మీద ఏర్పాటు చేసిన బడ్డీలను తీసేయాలని మూడు రోజుల ముందే దుకాణదారులకు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వచ్చేసరికి దుకాణాలు అలాగే ఉండడంతో ముందుగా విద్యుత్ మీటర్ లైన్లు కట్ చేశారు. మూడు గంటల సమయమిచ్చి స్వచ్ఛందంగా తీసేయాలని కోరారు. దీంతో కొంతమంది దుకాణదారులు తమ బడ్డీలను వ్యాన్‌లలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఇంతలో జోన్-3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శివాజీపార్క్ రోడ్డుకు చేరుకున్నారు. అప్పటికీ తొలగించని దుకాణాలను తొలగించే ప్రయత్నం చేయగా, చిరు వ్యాపారులు అడ్డుకున్నారు. ఉన్నపళంగా దుకాణాలు తీసి వేస్తే రోడ్డున పడతామని ప్రాధేయపడ్డారు.

నగరం మొత్తంగా ఆక్రమణ బడ్డీలను తొలగిస్తున్నామని ఇక్కడ ఆక్రమణలను కూడా తొలగించడం తప్పనిసరి అని అధికారులు వివరించి బడ్డీలను ట్రాలర్ లారీలు ఎక్కించారు. జోన్-3 ఏసీపీ మధుసూదనరావు ఆధ్వర్యంలో సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు పోలీసుల సహాయంతో శివాజీపార్క్ రోడ్డు ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలన్నీ తొలగించారు.

మామూళ్ల దసరా వచ్చేసింది!

"ఏవండోయ్ మీరు డ్యూటీకి వెళ్లే ముందు గ్యాస్ బాయ్‌కి ఇవ్వాలి ఓ వంద అక్కడ పెట్టి వెళ్లండి."

"అదేంటే... గ్యాస్ ధరకు అదనంగా రూ.50 ఇచ్చానుగా..?"

"అది ప్రతినెలా సిలిండరు తేవడానికి ఇచ్చేది. ఇప్పుడు దసరా మామూళ్లు. వంద ఇస్తేనే తీసుకుంటారట!"

మామూళ్ల దసరా వచ్చేసింది. మధ్యతరగతి కుటుంబానికి ఇదో పెద్ద భారం. రూ.వందతోనో, వెయ్యితోనో ఆగడం లేదు. మామూళ్లు ఎవరికి ఇవ్వాల్సి ఉంటుందని చూస్తే పెద్ద జాబితానే కనిపిస్తోంది. పెరిగిన ధరల పుణ్యమా అని వచ్చిన జీతంతో నెలంతా గడవడం ఎలా అని మథన పడుతుంటే.. ఈ మామూళ్ల గోలతో బుర్ర వేడెక్కిపోతోంది. మధ్యతరగతి' మారిపోతోంది. మరింత దిగజారిపోతోంది. ప్రతి నెలా సిలిండరు తెచ్చే గ్యాస్ బాయ్‌కు బిల్లు కంటే అదనంగా ఇవ్వక్కర్లేదు. మనం చెల్లించే బిల్లులోనే సర్వీస్ ఛార్జి ఉంది. కానీ ఈ అదనం అలవాటై పోయింది. ప్రతిరోజూ ఇంటి వద్ద చెత్త సేకరించే వాళ్లు మామూళ్లు గట్టిగానే వసూలు చేస్తున్నారు. రూ.100 అని గట్టిగా నిర్ణయించుకున్నారు. ప్రతి నెలా కరెంటు బిల్లు తీసేవారు గతంలో అనధికారికంగా రూ.20లు వసూలు చేసేవారు. ఇప్పుడు దసరా మామూళ్లంటూ చేతులు నలుపుకుంటున్నారు. కొన్ని చోట్ల లైన్‌మెన్లు ప్రతి ఇంటి నుంచీ వసూలు చేస్తున్నారు. వారికి రూ.50 తప్పడం లేదు. పోస్టుమ్యాన్‌కు అడగకపోయినా ఇవ్వాలనిపించి ఇస్తున్న వారున్నారు. తెల్లవారే ఇంటికి వచ్చి ఇచ్చే పేపర్ బాయ్‌కు ఏడాదికోసారి ఇవ్వక తప్పదు. కుళాయి విప్పే వాడు రూ. 100 నుంచి 200లు ధర ఫిక్స్ చేసేశాడు. ఇంతకుముందు ఇంటి మరమ్మతులు చేసిన ప్లంబర్, మేస్త్రీలు, కూలీలు మామూళ్లంటూ వస్తున్నారు. ఉన్న ద్విచక్రవాహనానికి పెరిగిన ధరతో పెట్రోల్ వేయించినప్పుడు ఉసూరుమంటుంటే, అక్కడ పంపు వద్ద 'సార్..' అన్న దీనచూపులు కనిపిస్తున్నాయి. మెకానిక్ వద్ద పని చేసే పిల్లాడికి, ప్రతి నెలా మన తలను తన చేతిలోకి తీసుకునే క్షురకుడికి తప్పదు. కిరాణా సంచిలో తెచ్చుకున్నా, బియ్యం బస్తా ఇంటికి తెచ్చే వారికి, ఇంట్లో పనిమనిషి, కేబుల్ టీవీ బాయ్‌కు, స్కూలులో, కళాశాలల్లో ఆయాలు, బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, అపార్టుమెంటులో వాచ్‌మెన్‌లు, వీధిలో దసరా సంబరాలు, చిన్న పిల్లలున్న వారికి అంగన్‌వాడీ ఆయాలు, రేషన్ డిపోలో.. ఇలా ఒకరనేముంది... ప్రతి రోజూ ఎవరో ఒకరు ఇంటికి వస్తూనే ఉన్నారు. ఇక చిన్న వ్యాపారం ఏదైనా నడిపితే, దసరా మామూళ్లంటూ వచ్చేవారికి లెక్కేలేదు. అందులో ప్రభుత్వ ఉద్యోగులూ ఉండడం గమనార్హం. వేలాది రూపాయల జీతం తీసుకుంటూ అదనపు ఆదాయం కోసం వీరు ఎవ్వరినీ వదలడం లేదు. వ్యాపారంతో సంబంధం ఉన్న ప్రతి శాఖ నుంచీ వసూళ్లు చేస్తూనే ఉన్నారు. వీటికి అడ్డూఅదుపూ లేనేలేదు. ఇక కొన్ని ప్రాంతాల్లో విలేకరుల పేరిట కూడా కొన్ని వర్గాల నుంచి దసరా మామూళ్ల డిమాండ్ చేయడం కనిపిస్తోంది. ఈ సీజన్‌లో ఏ పని చేయించుకుంటున్నా, పని వారు అదనంగా దసరా మామూళ్లను ఆశిస్తున్నారు. ఈ మామూళ్ల బాధ అందరికీ తప్పడం లేదు. ముఖ్యంగా పైసా ఆదాయం లేని వారైనా సరే,దసరామామూళ్లు ఇవ్వాల్సిం దే.

- ఆంధ్రజ్యోతి, ఎంవీపీ కాలనీ

గాయత్రీమాతగా అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం అమ్మవారికి గాయత్రి దేవి అలంకారం చేసి అష్టోత్తర పూజలు జరిపారు. సాయంకాలం సహస్రనామ, శ్రీచక్రం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కోరికలు కోరుకున్నారు.

సాగరగిరి ఆలయానికి పోటెత్తిన భక్తులు



బోటుపై వెళ్లేందుకు నిరీక్షిస్తున్న భక్తులు



గాయత్రి దేవిగా అమ్మవారు

మల్కాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగాయారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సముద్రంపై బోటులో విహరిస్తూ వెళ్లేఅవకాశం రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. అంతేకాక ఆటోలు, బస్సులలో మరింతమంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బోటు దిగిన వెంటనే బస్సులనుఉచితంగా కొండపైకి చేర్చేందుకు ఆలయ నిర్వాహకులుమూడు ఆటోలను ఏర్పాటు చేశారు. గాజువాక డిపో నుంచి నడిచే 55వ నంబరు బస్సు ను ఆలయం వరకు పొడిగించారు. అమ్మవారి భక్తుడు మజ్జి సోమేష్ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


జీఎస్టీ సవరణతో వైద్య రంగానికి ప్రయోజనం

- బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు

ఆరిలోవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ తీసుకొన్న జీఎస్టీ సవరణ వల్ల వైద్య రంగానికి ఎంతో మేలు జరిగిందని బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వైద్యానికి సంబంధించిన పలు పరికరాలు, ఔషధాల ధరలు తగ్గాయన్నారు. రక్త పరీక్షలకు ఉపయోగించే కిట్స్, పరికరాలతో పాటు క్యాన్సర్, రక్త పోటుకు సంబంధించిన వ్యాధుల ఔషధాల ధరలు తగ్గాయన్నారు. దీనివల్ల ముఖ్యంగా.. పేదలు, మధ్య తరగతికి చెందిన వారికి ఉపశమనం లభిస్తుందన్నారు.

నిండుకుండలా మేహాద్రిగెడ్డ

- 60.2 అడుగులకు చేరిన నీటిమట్టం
- రిజర్వాయర్ నుంచి 1,058 క్యూసెక్కులు విడుదల



రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన వరద నీరు

గోపాలపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో ఒక గేటు ఎత్తి 1,058 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు.రిజర్వాయర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 61 అడు గులు కాగా గత నెల కురిసిన వర్షాలకు సెప్టెంబరు మొదటి వారంలోనే 60 అడుగులు దాటింది. దీంతో గేటును ఎత్తి వరద నీటిని విడుదల చేసి నీటిమట్టం 59 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో భారీగా పెరిగి మంగళవారం ఉదయానికి 60.2 అడుగులకు చేరింది. దీంతో రెండో నెంబరు గేటును అడుగున్నర మేర ఎత్తి 1,058 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి నీటిమట్టం 60 అడుగులకు చేరే వరకూ నీటి విడుదల కొనసాగుతుందని రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు. నీటి పారుదల శాఖ ఏఈఈ పి.నళిని, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బరాజు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఈఈ స్వామినాయుడు సూచించారు.

శరన్నవరాత్రి పూజల్లో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నక్కవానిపాలెం లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని మీనాక్షి అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేకపూజలు అసోసియేషన్ ప్రతినిధులు ప్రణవ్ గోపాల్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం చైతన్యనగర్‌లోని హిమాయత్ గౌరీ కనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు. కేఎంఆర్ కాలనీలో యూత్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించే పూజల్లోను, రామాటాకీస్ వద్ద యంగ్‌స్టార్ యూత్ అసోసియేషన్ నిర్వహించే దేవీనవరాత్రి ఉత్సవాల్లోను ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు ఆయన్ని సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

శాప్ ఉద్యోగి కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం



మృతుడు ప్రకాశ్ భార్యకు చెక్కు అందజేస్తున్న శాప్ అధికారులు జ్యూన్ గ్యాలియట్, వెంకటేశ్వరరావు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు ఎరీనా ప్రాంతంలో పిడుగు పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సూర్యప్రకాష్ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించింది. ప్రమాద సంఘటన తెలుసుకున్న శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి, చైర్మన్ ఎ.రవినాయుడు స్పందించి ప్రకాష్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును విడుదల చేసి సంతాపం ప్రకటించారు. ఆ చెక్‌ను రాష్ట్ర క్రీడా కార్యాలయం నుంచి స్పోర్ట్సు ఆఫీసర్ జ్యూన్ గ్యాలియట్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి వెంకటేశ్వరరావులు మంగళవారం సూర్యప్రకాష్ భార్యకు అందజేశారు. దహన ఖర్చుల నిమిత్తం జిల్లా కలెక్టర్ విడుదల చేసిన రూ.15 వేల చెక్కును ప్రకాష్ భార్యకు డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు అందజేశారు.

అప్రెంటీస్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత



అప్రెంటీస్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో అప్రెంటీస్‌షిప్‌ల కోసం ఎంపికైన 15 మంది అభ్యర్థులకు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ద్వారకా బస్‌స్టేషన్‌లోని తన కార్యాలయంలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడుల్లో వీరికి విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, గాజువాక, సింహాచలం, స్టీల్‌సిటీ, మధురవాడ డిపోల్లో నియమించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఆర్ఎం కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ పర్సనల్ జి.శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్‌చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 32, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 20, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 65, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 30, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	122
లైవ్ ధర	142
విత్ స్కిన్	254
స్కిన్‌లెస్	264

ఏయూ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థం చేయాలి

- కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రొఫెసర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థంచేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శ్రీనివాస్ సూచించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు దృష్టితో ముందుకు సాగాలన్నారు. చరిత్రకారులు, విశిష్ట ప్రొఫెసర్లతో సంప్రదించి ఏయూ ప్రగతి, వికాసాలను గ్రంథస్థం చేస్తే భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏయూ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌గా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల సహకారం అవసరమన్నారు. ఏయూ వెబ్‌సైట్ ఆసక్తిదాయకంగా, ఇంటరాక్టివ్‌గా ఉండాలన్నారు. ఎంతోమంది నాయకులను, నిపుణులను అందించిన ప్రతిష్ఠాత్మక వర్సిటీగా గుర్తింపు ఉందన్నారు. ప్రొఫెసర్లు నిరంతరం పరిశోధనలు చేయడం, పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా చూడాలన్నారు. దేశవ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేసిన సందర్భాల్లో అక్కడి అనుభవాలను పంచుకున్నారు. ప్రత్యేక స్టడీ గ్రూపులను కలిగి ఉండి, విభిన్న అంశాలను అధ్య యనం చేయడంపై దృష్టి సారించాలన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఆదివాసీలకు సంబంధించిన అంశాలపై ఈ గ్రూపులు అధ్యయనం చేయాలని సూచించారు. శతాబ్ది వేడుకల సమయంలో ఏయూకు రావడం ఆనందంగా ఉందన్నారు. వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ శ్రీనివాస్‌ను సత్కరించి జ్ఞాపికను అందించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, జి.గిరిజా శంకర్, పద్మశ్రీ, జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

- గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మిట్టమధ్యాహ్నం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఓ ఇంట్లోకి వెళ్లి మహిళ మెడలో గొలుసు లాక్కుని ఉడాయించిన నిందితుడిని పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. విశాఖ నగరంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

నగరం నడి బొడ్డున నిత్యం రద్దీగా ఉండే పాతజైల్ రోడ్డులోని గొల్లలపాలెం రామాలయం ఎదురుగా ఉన్న రోడ్డులోని ఓ ఇంట్లో మహిళ ఒంటరిగా ఉంటోంది. ఓ వ్యక్తి వచ్చి తాగేందుకు నీళ్లు కావాలని అడిగాడు. ఆమె సరే అని వెనక్కి తిరిగిన వెంటనే ఆమె నోరు నొక్కి మెడలో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే రెండు తులాల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు.

ఆమె తేరుకొని కేకలు వేయడంతో స్థానికులు వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన టూటౌన్ క్రైమ్ పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన దరావత్ జీవరత్నం (51)గా గుర్తించి పట్టుకున్నారు. అతడిపై హత్య కేసు ఉందని, ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడని తెలిపారు.

నిందితుడి వద్ద గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

'పర్యావరణహిత జీవనం అలవర్చుకోవాలి'



కృష్ణాకళాశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

మద్దిలపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు పర్యావరణ హిత జీవనాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, గ్రీన్ క్లైమెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు కాలుష్య రహిత నగరాన్ని అందించవచ్చన్నారు. అలాగే మన పరిసరాలు మనమే శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఒక్కసారి వినియోగించి వదిలేసే ప్లాస్టిక్ వస్తువులు అసలు వాడవద్దని, వస్త్ర సంచులనే వినియోగించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్లాత్ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కళాశాల అధ్యాపకులు బి.లక్ష్మీ, పుష్పలత, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవీనవరాత్రి ఉత్సవాల్లో సామూహిక కుంకుమాభిషేకాలు



కరకచెట్టు పోలమాంబ ఆలయంలో గాయత్రిదేవి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ ఆలయంలోనూ, పక్కనున్న పందిరిలోని మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరావు శర్మ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలతో సహస్ర నామాలను జపిస్తూ కుంకుమాభిషేకాన్ని నిర్వహింపజేశారు. ఈ పూజా కార్యక్రమంలో సుమారు 100 మందికి మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు నారాయణరావు, మురళి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ దేవాలయంలో దేవదాయ ధర్మాదాయశాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అ ర్చకులు సంప్రదాయ రీతిలో అర్చనలు, విశేష పూజలు ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల సారథ్యంలో చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ సన్నిధిలోనిర్వహించిన కలగా మురళీకృష్ణ ప్రవచనం, రాగమాలిక సేవా సాం స్కృతిక సంస్థ వారు పలు సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. అనంతరం ఆలయ ఈవో కె.గాయత్రి చేతులమీదుగా కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ కెమిస్ట్రీ విభాగానికి ఫర్నీచర్ వితరణ



నాగేశ్వరరావును సత్కరిస్తున్న రిజిస్ట్రార్ రాంబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్శిటీలోని కెమిస్ట్రీ విభాగానికి వర్శిటీ అనుబంధ కాలేజీ పీఎంఎన్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం క్లాస్‌రూమ్‌లో విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన టేబుల్స్‌ను అందించారు. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే టేబుల్స్, బెంచీలను విభాగాధిపతి ప్రొఫెసర్ శైలజకు పీఎంఎన్ కాలేజీ సెక్రటరీ, చైర్మన్ బి.నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు అభినందించి సత్కరించారు. గతంలోనూ వర్శిటీకి అవసరమైన సహకారాన్ని అందించామని, భవిష్యత్‌లో తమకు చేతనైన సాయాన్ని వర్శిటీకి అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో శ్యామ్‌కు స్వర్ణ పతకం


స్వర్ణం సాధించిన శ్యామ్ భగవాన్

విశాఖపట్నం స్పోర్ట్స్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన శ్యామ్ భగవాన్ స్వర్ణ పతకం సాధించాడు. గుంటూరులో జరుగుతున్న ఈ టోర్నీలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్యామ్ భగవాన్ పురుషుల 80 మీ. హర్డిల్స్‌లో స్వర్ణ పతకం సాధించి రాష్ట్రానికి పతకం అందించాడు. పతకం సాధించిన శ్యామ్‌తోపాటు జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న పిట్టా శ్రీనివాస్‌ను (రైల్వేస్) జిల్లా సంఘం ప్రతినిధులు అభినందించారు.

ఆసియా ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టెక్నికల్ అఫీషియల్‌గా జీవన్‌కుమార్



విశాఖపట్నం స్పోర్ట్స్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక 11వ ఏషియన్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి టెక్నికల్ అఫీషియల్‌గా వాల్తేరు రైల్వే స్విమ్మర్, నగరానికి చెందిన ఆర్.జాన్ జీవన్‌కుమార్ నియమితులయ్యారు. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 28 నుంచి అక్టోబరు 1 వరకు గుజరాత్ వీర్ సవార్కర్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరగనున్న ఏషియన్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో 29 దేశాల నుంచి స్విమ్మర్ల మధ్య 40 ఈవెంట్లలో జరగనున్న ప్రతిష్ఠాత్మక టోర్నీకి టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్న జీవన్‌కుమార్‌ను సీనియర్ స్విమ్మర్లు, కోచ్‌లు అభినందించారు.

మెట్టు-తాటిచెట్లపాలెం రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కంచరపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కంచరపాలెం మెట్టు-తాటిచెట్లపాలెం రోడ్డుకు మరమ్మతులను జీవీఎంసీ అధికారులు చేపట్టారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో వీధి లైట్లు సౌకర్యం ఏర్పాటు, రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 22న 'మెట్టు-తాటిచెట్లపాలెం మధ్య మసకబారిన ప్రగతి' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మెట్టు నుంచి తిక్కవానిపాలెం వరకు రోడ్డుకు ఏర్పడిన గోతులపై తారువేసి పూడుస్తున్నారు. రోడ్డుకు ఏర్పడిన గోతులు పూడ్చడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రధాన సమస్యగా ఉన్న వీధి దీపాలను విద్యుత్ శాఖ అధికారులు అమర్చాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ వెలుగులు ఉంటే రాత్రి సమయంలో ప్రమాదాలు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర


రుద్రప్రసాద్‌కు అక్కినేని పురస్కారం ప్రదానం చేస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర ప్రాంతం కావడంతో కళాకారులను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత బ్యాంకు ఉద్యోగి రుద్రప్రసాద్ అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని అక్కినేని చిత్ర గీతాష్టమి స్వరాంజలి, భూపతి కృష్ణంరాజు సంయుక్త ఆధ్వర్యంలో కళాకారుల సత్కార సినీ విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఉషచీరాల, మేడమస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, సత్యం, భయ్యా శ్రీనివాస్, వెంకట్, ఎంవీఆర్, పట్టం వెంకటేష్‌లతో కలిసి రుద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కినేని సినీనటుడిగా కాకుండా సేవాభావంలోనూ ఆదర్శంగా నిలిచారన్నారు. విభిన్న వేషధారణల ద్వారా అలరించిన రుద్రప్రసాద్‌ను అక్కినేని పురస్కారంతో కళాకారులు సన్మానించారు. భూపతి, కృష్ణంరాజు, చారి, నరసింగరావు, రంజిత, సత్యవతి, సుజాత, సాత్విక, అంబికాలు అలనాటి మేటి గీతాలను ఆలపించారు.

సూపర్ బజారు పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూపర్ బజారు (విశాఖపట్నం కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్) పర్సన్ ఇన్‌చార్జిగా ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కొనసాగుతున్నారు. ఈ పదవిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

లైంగిక వేధింపులపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించొద్దు

» అవగాహన సదస్సులో డీఆర్ఎం లలిత్ బొహ్రా



సదస్సులో ప్రసంగిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా పేర్కొన్నారు. నగరంలోని పోర్టు సాగర మాల కన్వెన్షన్‌లో వాల్తేరు రైల్వే, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ) సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన సదుస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా లలిత్ బొహ్రామాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. లైంగిక వేధింపుల నివారణకు యాజమాన్యం, ఉద్యోగులు, ప్రభుత్వం సంయుక్తంగా కృషి చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. వికసిత భారత్-2047 నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలలో మహిళలు అన్ని రంగాలలో భాగస్వామ్యం కావడమే మోదీ ఉద్దేశమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేసే మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపుల చట్టం అండగా ఉందని గుర్తు చేశారు. వాల్తేరు రైల్వేకు సంబంధించి మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రాంతాలలో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే అమృతభారత్ పథకంలో భాగంగా జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి నిర్మాణాలలో మహిళల కోసం విశ్రాంతి గదిని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. లైంగిక వేధింపులు కేవలం మహిళలకే పరిమితం కాదని, పురుషులకు కూడా ఎదురయ్యే సందర్భాలు ఉన్నాయన్నారు. పని ప్రదేశాలలో మహిళలు, పురుషులు పరస్పర అవగాహనతో విధులు నిర్వహిస్తే లైంగిక వేధింపులకు తావుండదని సూచించారు. లైంగిక వేధింపులకు పాల్పడితే సహించేది లేదని, అటువంటి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు, భారత ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి మహిళలకు రక్షణగా నిలవడమే కాకుండా లైంగిక వేధింపులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఎఫ్ఐసీసీఐ ప్రతినిధి ఆంబ్రియా ఆంజలీనో మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టంపై దేశవ్యాప్తంగా భారతీయ రైల్వేల సహకారంతో చేపడుతున్న సదస్సులు, అవగాహన కార్యక్రమాలను వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పురుష, మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపు చట్టం అవగాహన అంశాలను ఎఫ్ఐసీసీఐ సభ్యురాలు డాక్టర్ హేమ తెలుపుతూ ఉద్యోగిని, ఉద్యోగి ప్రశ్నలకు సమాధానం రూపంలో వివరించారు.


లలితా దేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు


చండికా పరమేశ్వరీ అలంకరణలో దుర్గాదేవి


లలితాకాలనీలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

విభిన్న అలంకరణలలో అమ్మవారి దర్శనం

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రెండో రోజు లలితా దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో లలితాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో 200 మంది మహిళలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చన, హోమం, లలితాదేవి పారాయణం జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

చండికా పరమేశ్వరీ అలంకరణలో దుర్గాదేవి

సీతమ్మధార, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రి, బ్రహ్మోత్సవాల్లో అమ్మవారిని మంగళవారం చండికా పరమేశ్వరీ అమ్మవారిగా అలంకరించారు. వేంకటేశ్వరస్వామి శ్రీకృష్ణ భగవానుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండో రోజు దుర్గాదేవి అమ్మవారిని పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో సాయంత్రం వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించి, భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.


నక్కవానిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

నక్కవానిపాలెంలో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో మధుర మీనాక్షి అలంకరణలో ఉన్న అమ్మవారిని మంగళవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు బండారు గుప్తాజీ, అసోసియేషన్ ప్రతినిధులు ప్రణవ్ గోపాల్‌ను శాలువాతో సత్కరించారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ లలితాకాలనీలో దుర్గాగణపతి, ఓంకార యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 31వ వార్డు తెలుగుదేశం నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, టీడీపీ వార్డు కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ పల్లా నగేష్, ఆర్జీ రాజేష్, సెక్రటరీ పి.అప్పలరాజు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కె.సాయిలక్ష్మీ, రమేష్ పాల్గొన్నారు.

వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు చేరువలో సాహితి వర్షిణి



విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి, ఫిడే మాస్టర్ సాహితి వర్షిణి వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు చేరువైంది. విశాఖ నుంచి తొలి వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిలిస్టు కావాలనే సంకల్పంతో చదరంగం బోర్డుపై ఎత్తులు వేస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం 2266 రేటింగ్‌తో ఉన్న సాహితి వర్షిణి... వుమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌కు అవసరమైన తొలి నార్మ్‌ను సాధించింది. ఈ నెల 10 వరకు హంగేరిలో జరిగిన గోల్డెన్ హార్స్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో బలమైన ప్రత్యర్థులతో తలపడి అద్భుతంగా రాణించింది. హంగేరికి చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ వరాది విక్టర్‌పై గెలుపొందిన సాహితి...మరో ఇద్దరు ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిలిస్టులైన పోపోవిచ్ ఆడమ్, డేనియల్‌లపై గేమ్‌లను డ్రా చేసింది. దీంతో ఈ టోర్నీ ద్వారా ఆమె రేటింగ్ మరో 36 పాయింట్లతో 2266కి చేరింది. వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు అవసరమైన మరో రెండు నార్మ్‌ను సాధించడంపై దృష్టి సారించిన సాహితి వర్షిణి...తన తండ్రి లోకేశ్వరరావు శిక్షణలో రాణిస్తూ ఈ స్థాయికి చేరడం విశేషం. ఇప్పటివరకు ఏషియన్ అండర్-10, 12 చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకోవడంతోపాటు కామన్‌వెల్త్ అండర్-10 చెస్ టోర్నీలో స్వర్ణ పతకం సాధించిన సాహితి వర్షిణి....చెన్నైలో జరిగిన ఒలింపియాడ్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు తొలి నార్మ్‌ను సాధించిన సాహితి వర్షిణిని ఆల్ విశాఖ చెస్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

శాప్ ఉద్యోగికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా


ప్రకాష్ భార్యకు చెక్కు అందజేస్తున్న శాప్ అధికారులు

విశాఖపట్నం స్పోర్ట్స్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు ఏరీనా ప్రాంతంలో పిడుగు పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సూర్యప్రకాష్ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించింది. ప్రమాద సంఘటన తెలుసుకున్న శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి, చైర్మన్ ఎ.రవినాయుడు స్పందించి ప్రకాష్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును విడుదల చేసి సంతాపం ప్రకటించారు. ఆ చెక్‌ను రాష్ట్ర క్రీడా కార్యాలయం నుంచి స్పోర్ట్సు ఆఫీసర్ జ్యూన్ గ్యాలియట్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి వెంకటేశ్వరరావులు మంగళవారం సూర్యప్రకాష్ భార్యకు అందజేశారు. దహన ఖర్చుల నిమిత్తం జిల్లా కలెక్టర్ విడుదల చేసిన రూ.15 వేల చెక్కును ప్రకాష్ భార్యకు డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు అందజేశారు.

ఉత్తరాంధ్రవాసులకు అత్యాధునిక వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి

» అసెంబ్లీలో విజ్ఞప్తి చేసిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు


అసెంబ్లీలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు (ఫైల్)

సీతమ్మధార, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యఖర్చుల బిల్లు భరించలేనంతగా ఉంటున్నందున ఉత్తరాంధ్రవాసులకు అత్యాధునిక వైద్యం ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అభ్యర్థించారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిమ్స్ తరహాలో అత్యాధునిక వైద్య వసతులు విశాఖ కేంద్రంగా లభించేలా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇటీవల విశాఖలో క్యాన్సర్ చికిత్సకు అత్యాధునిక వైద్య ఉపకరణాలను ప్రారంభించడం పట్ల నాలుగు జిల్లాల ప్రజల తరఫున ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్య ఖర్చులను నియంత్రించే విధంగా కమిటీ వేయాలని సూచించారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే ఎన్ని రూ.లక్షలు ఖర్చవుతుందో తెలియక ప్రజలు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. జనరిక్ మందులపై ప్రజలకు నమ్మకం కలిగిస్తే వైద్య అవసరాలకు చాలా తక్కువ ఖర్చవుతుందన్నారు. బీపీఎల్ కుటుంబాలకు రూ.25 లక్షల వైద్య బీమా ఇవ్వడం సంతోషకరమే అయినా, ఏపీఎల్ కుటుంబాలకు ప్రతిపాదించిన రూ.2.5 లక్షల నగదు రహిత చికిత్సల వ్యయ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. మధ్యతరగతి వారు, ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి ప్రభుత్వ ప్రయోజనం పొందలేకపోతున్నారని విష్ణుకుమార్‌రాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 70 సంవత్సరాలు వయస్సు దాటిన వారికి రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు భరించే ఆయుష్మాన్ కార్డును ఆసుపత్రుల వారు ఆమోదించడం లేదని, దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. విశాఖలో ప్రారంభించిన విమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు లభించేలా అవసరమైన విభాగాలు ప్రారంభించాలని విష్ణుకుమార్‌రాజు కోరారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పిల్లలు, గర్భిణులు పెద్ద సంఖ్యలో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖపట్నంలో వైద్య కళాశాలకు స్థలం కేటాయిస్తే రాష్ట్రం ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా కేంద్ర ప్రభుత్వం నిర్మాణం చేపడుతుందని పేర్కొన్నారు. ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే నాలుగు జిల్లాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు.

పట్టపగలు మహిళ మెడలో గొలుసు చోరీ

» గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిట్టమధ్యాహ్నం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఓ ఇంట్లోకి వెళ్లి మహిళ మెడలో గొలుసు లాక్కుని ఉడాయించిన నిందితుడిని పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. విశాఖ నగరంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరం నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే పాతజైల్ రోడ్డులోని గొల్లలపాలెం రామాలయం ఎదురుగా ఉన్న రోడ్డులోని ఓ ఇంట్లో మహిళ ఒంటరిగా ఉంటోంది. ఓ వ్యక్తి వచ్చి తాగేందుకు నీళ్లు కావాలని అడిగాడు. ఆమె సరే అని వెనక్కి తిరిగిన వెంటనే ఆమె నోరు నొక్కి మెడలో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే రెండు తులాల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఆమె తేరుకొని కేకలు వేయడంతో స్థానికులు వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన టూటౌన్ క్రైమ్ పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన దరావత్ జీవరత్నం (51)గా గుర్తించి పట్టుకున్నారు. అతడిపై హత్య కేసు ఉందని, ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడని తెలిపారు. నిందితుడి వద్ద గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రంజీ ట్రోఫీకి 31 మంది ప్రాబబుల్స్ ఎంపిక

విశాఖపట్నం-స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రంజీ ట్రోఫీ కోసం ఆంధ్ర సీనియర్ జట్టుకు 31 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. బుధవారం నుంచి విజయనగరంలోని ఏసీఏ అకాడమీలో కొత్త కోచ్ గ్యారీ స్టెడ్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం తుది జట్టును ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం ప్రకటించిన ప్రాబబుల్స్‌లో కేఎస్ భరత్, రేవంత్‌రెడ్డి, మహీప్‌కుమార్, అభిషేక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఎం.హర్షవర్ధన్, ఎస్‌కే రషీద్, హేమంత్‌రెడ్డి, రిక్కీబుయ్, కరణ్ షిండే, అశ్విన్ హెబ్బర్, యర్రా సందీప్, కేవీ శశికాంత్, ఎ.బ్రహ్మతేజ, పి.తపస్వి, జీఎస్‌పీ తేజ, సీహెచ్ స్టీఫెన్, వై.పృథ్వీరాజ్, పి.సత్యనారాయణరాజు, కె.సుదర్శన్, కె.సాయితేజ, సాకేత్‌రామ్, మునిష్‌వర్మ, సౌరభ్‌కుమార్, ఎస్.ఆశిష్, ఎం.ఆంజనేయులు, టి.విజయ్, టి.భరత్, ఎ.లలిత్‌మోహన్, జి.మనీష్, దీపన్ సాయినాథ్ ఉన్నారు.

కుండపోత

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం మండలంలోని గోస్తనీ పంప్ హౌస్ వద్ద 41.5, గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద 35.5 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది. బుధవారం నుంచి మరో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. శివారు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. 25 నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

అక్కయ్యపాలెం: కుండపోతగా కురిసిన వర్షానికి రోడ్లు, గెడ్డలు, డ్రైనేజీలు, కాల్వలు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కయ్యపాలెం, కైలాసపురం, మధుసూదన్‌నగర్, నరసింహనగర్, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం, ఎనభై అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

ఆర్టీసీ బస్సుల్లో 75 శాతం మహిళలే

... 5వ పేజీ తరువాయి

సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఆగస్టు 15కు ముందు రీజియన్‌లో రోజువారీ సగటున 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. అందులో మహిళలు 1.5 లక్షలు, పురుషులు 1.6 లక్షల మంది ఉండేవారు. మహిళల కంటే పురుషులు పది వేల మంది ఎక్కువగా ప్రయాణించేవారు. స్త్రీశక్తి అమలైన తరువాత సగటున రోజుకు 4.1 లక్షల మంది ప్రయాణిస్తుండగా, అందులో 3.07 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తుండగా, పురుషుల సంఖ్య 1.03 లక్షలకు తగ్గినట్టు అధికారులు లెక్కలు తేల్చారు.

సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ కేంద్రంగా ఈసీబీసీ భవనం

... 5వ పేజీ తరువాయి

ఈ ఎక్స్‌లెన్స్ సెంటర్ నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేస్తుంది. పరిశోధనలకు పెద్దపీట వేస్తుంది. పారిశ్రామిక అవసరాలకు తగినట్టుగా స్కిల్ డెవలప్‌మెంట్, కెపాసిటీ బిల్డింగ్ కోసం కార్యక్రమాలు చేపడుతుంది. విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రజా సంఘాల మధ్య వారధిగా ఉంటుంది. డేటా ఆధారంగా పైలట్ ప్రాజెక్టులు చేపడుతుంది. ఎనర్జీ రంగంలో ఇంకుబేషన్ సెంటర్లను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ, స్టోరేజ్ విధానాలను ఇంటిగ్రేట్ చేయడానికి యత్నిస్తుంది. రూఫ్ టాప్ సోలార్, మైక్రో గ్రిడ్లు, ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్‌కు మౌలిక వసతులు, గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టులు, అధ్యయనాలు చేపడుతుంది. ఉద్యోగ అవకాశాలు పెంచుతుంది.

నైట్ ఫుడ్‌కోర్టు పేరుతో వైసీపీ రాజకీయం!

... 5వ పేజీ తరువాయి

అనుమతి ఇచ్చేలా ఒత్తిడి చేస్తామంటూ హామీ ఇచ్చారు. వైసీపీ నేతల మాటలు నమ్మిన కొందరు వ్యాపారులు రెండు రోజుల కిందట సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయానికి వెళ్లారు. కనీసం నోటీసు ఇవ్వకుండా దుకాణాలను ఎలా తొలగిస్తారంటూ అక్కడ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును వైసీపీ నేతలు ప్రశ్నించారు. పండుగలోగా కౌన్సిల్/స్టాండింగ్ కమిటీ ఆమోదంతో అక్కడే ఫుడ్‌కోర్ట్‌ను తిరిగి ఏర్పాటుచేయించాలని డిమాండ్ చేశారు. జోనల్ కమిషనర్‌తో బలవంతంగా హామీ పత్రం రాయించి వ్యాపారులకు అందజేసేలా చేశారు. కూటమిలోని కొందరు ప్రజా ప్రతినిధులు కూడా ఫుడ్‌కోర్టులో వ్యాపారులకు అనుకూలంగా ఉండడంతో వారితో లోపాయికారీగా వైసీపీ నేతలు మాట్లాడి, వారి సూచన మేరకు వ్యాపారులను వెంటబెట్టుకుని జోనల్ కార్యాలయానికి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. జోనల్ కమిషనర్‌కు కూటమి నేతలు కూడా ఫోన్ చేసి వైసీపీ నేతలు కోరినట్టు హామీ పత్రం రాసివ్వాలని, లేనిపక్షంతో తమ సత్తా ఏమిటో చూపిస్తామని బెదిరించారని, అందువల్లే ఆయనకు అధికారం లేకపోయినాసరే హామీ పత్రం ఇచ్చినట్టు చెబుతున్నారు. దుకాణాల ఏర్పాటు జరిగిన తర్వాత తమకు వ్యాపారుల నుంచి తలా ఇంత అని చెప్పి వసూలుచేసి ఇవ్వాలని...అక్కడ నాలుగైదు దుకాణాలు కలిగిన ఇద్దరు వ్యాపారులతో వైసీపీ నేతలు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'హైడ్రో పవర్'పై అపోహలు

... 5వ పేజీ తరువాయి

పూర్తయ్యాక నైపుణ్యం కలిగిన వారికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. చదువుకున్న గిరిజన యువతకు విద్యుత్ ప్రాజెక్టుల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇంకా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి. వాటిలోను ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపే ప్రాజెక్టులుగా వీటికి గుర్తింపు లభించనుంది. ప్రభుత్వం గిరిజనులకు ఎటువంటి నష్టం లేకుండా, వారికి మేలు జరిగే విధంగా ఈ ప్రాజెక్టుల పనులు చేపట్టాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో సదస్సులు నిర్వహించి వారిలో అపోహలు తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

వల్లభాయ్ పటేల్ వంతెన రెడీ

... 5వ పేజీ తరువాయి

తుప్పు పట్టకుండా ప్రత్యేక పెయింటింగ్స్ వేశారు. వంతెన కాలపరిమితి 60 ఏళ్లుగా నిర్ధారించారు. మద్రాస్ ఐఐటీ (ప్రాజెక్ట్ మోనటరింగ్ కమిటీ) పర్యవేక్షణలో పనులు సాగాయి. దీని డిజైన్‌ను కూడా వారే రూపొందించారు. వంతెన పొడవు 330 మీటర్లు, వెడల్పు 10.5 మీటర్లు. ఇందులో ఏడు మీటర్లు వాహనాలు వెళ్లేందుకు, రెండువైపులా అడుగున్నర చొప్పున ఫుట్‌పాత్ నిర్మించారు. 33 మీటర్ల దూరాన్ని పరిమాణంగా తీసుకుని మొత్తం 10 పిల్లర్లు నిర్మించారు. వంతెనపై 15 విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు.

ఒకవైపు మాత్రమే అనుమతి

ప్రస్తుతం వంతెనపై ఒకవైపు మాత్రమే అదీ తేలికపాటి వాహనాలకు అనుమతిస్తారు. పారిశ్రామిక ప్రాంతం నుంచి కాన్వెంట్ జంక్షన్ వైపు వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉంది. తిరిగి వచ్చేవారు కాన్వెంట్ జంక్షన్-షీలానగర్ రోడ్డులో మారుతి సర్కిల్ నుంచి పారిశ్రామిక ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ సాగరమాల పేరుతో హైవే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయినన తరువాత వంతెన పైనుంచి ఇరువైపులా రాకపోకలకు అనుమతిస్తారు.

ఫీజు పెండింగ్

... 5వ పేజీ తరువాయి

సమీక్షించుకుంటూ విధానాల్లో మార్పులను తీసుకుంటూ వచ్చింది. వైసీపీ సర్కార్ తెచ్చిన విద్యా, వసతి దీవెనల స్థానంలో మళ్లీ స్కాలర్‌షిప్, ఫీజు లను గతంలో మాదిరిగానే నేరుగా కాలేజీలకు చెల్లించే విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో బకాయిలు ఉన్నప్పటికీ విద్యార్థులపై ఒత్తిడి పెట్టలేని పరిస్థితి యాజమాన్యాలకు ఏర్పడింది. పెండింగ్‌లో బకాయిలను విడుదల చేయాలని కాలేజీ యాజమాన్యాలు కొద్దిరోజులుగా ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో దసరా తరువాత తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి వివిధ పద్ధతుల్లో తీసుకువెళ్లాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా వాట్సాప్ ద్వారా విజ్ఞాపనలు పంపించడం, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం, ఆ తరువాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతులు సమర్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోనట్టయితే కాలేజీలను మూసి సమ్మె చేపడతామని హెచ్చరిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అధికారులను వివరణ కోరగా..బకాయిలను విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

వీధి వ్యాపారుల సర్వే పూర్తి

... 5వ పేజీ తరువాయి

21 చోట్ల వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. ప్రభుత్వ అనుమతి రాగానే పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మరికొన్నిచోట్ల కూడా వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు. కాగా నగరంలో రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రధాన కూడళ్లలో ఆక్రమణలను తొలగించి ప్రజలకు రక్షణ, ఉత్తమ జీవన పరిస్థితులను కల్పించేందుకే ఆపరేషన్ లంగ్స్‌కు శ్రీకారం చుట్టామని యూసీడీ పీడీ సత్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిగురించి వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాపారుల సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి వారి జీవనోపాధికి ఇబ్బంది కలుగకుండా జీవీఎంసీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆక్రమణలు తొలగింపుపై అపోహలు, వదంతులు, అసత్యప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. అర్హులైన వ్యాపారులందరికీ స్ట్రీట్ వెండింగ్‌జోన్ చట్టం ప్రకారం స్వేచ్ఛగా వ్యాపారం సాగించుకునే వెసులుబాటు కల్పించేందుకు కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రణాళికలు రూపొందించారని వివరించారు.

టిడ్కో గృహాల పనులను 2 నెలల్లో పూర్తి చేస్తాం

ఎస్‌ఈ వెంకటేశ్వరరావు

పెదగంట్యాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలోని టిడ్కో గృహాల పనులను రెండు నెలల్లోపూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు అన్నారు. టిడ్కో, టాటా ప్రాజెక్టు అధికారులతో కలిసి సోమవారం ఆయన ఇక్కడి టిడ్కో గృహసముదాయాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మౌలికవసతుల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ సుధాకర్, డీఈ రాజేశ్, టాటా ప్రాజెక్టు మేనేజర్ హర్షవర్ధన్, ఈఈ రాజబాబు, ఏఈ గోపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యుడు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల సమస్యను పరిష్కరించాలని వినతి

గాజువాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ వర్కర్ల మిస్సింగ్ జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ గాజువాక వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు విజయవాడలో ఆప్కాస్ ఎండీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2022 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది జూలై వరకు సుమారు 50 మంది కార్మికుల జీతాలు మిస్ అయ్యాయని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని, అందువల్ల త్వరితంగా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎండీని కలిసిన వారిలో నాయకులు గొలగాని అప్పారావు, నూకరాజు, నాగరాజు, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ఫైలేరియా రోగులకు కిట్లు

మల్కాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 60వ వార్డు పరిధి ఇందిరా కాలనీ-1 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో ఫైలేరియా బాధితులకు వ్యాధి నివారణ మందులతో కూడిన కిట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ బొడ్డేటి సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వైవీ రమణ మాట్లాడుతూ ఫైలేరియా బాధితులందరూ కిట్లలోని మందులను రోజూ వాడితే వ్యాధి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి జీవీ సాయిసుజిత్, మలేరియా విభాగం సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గాజువాక వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడిగా మంగరాజు



అగనంపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గాజువాక నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా ఉక్కు నిర్వాసిత కాలనీ పినమడకకు చెందిన అండిబోయిన మంగరాజును నియమిస్తూ మంగళవారం పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచ లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 32, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 20, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 65, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 30, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

వృథాగా పోతున్న తాగునీరు.. అధికారులు పట్టించుకోరు!

- కొళాయిల నుంచి సజావుగా నీరందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న 64, 65 వార్డుల ప్రజలు



పెదగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద రహదారిపై వృథాగా పారుతున్న తాగునీరు

పెదగంట్యాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అండర్‌గ్రౌండ్ పైపు లైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని జీవీఎంసీ కోట్ల రూపాయలను వెచ్చించి కేబీఆర్, ఏలేరు రిజర్వాయర్ల నుంచి నీటిని తెచ్చి.. శుద్ధి చేసి పైపు లైన్ల ద్వారా ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తుంది. అయితే పలు వార్డుల్లోని తాగునీటి సరఫరా పైపు లైన్లు పగిలిపోయి, నీరు లీకవుతు పెద్దఎత్తున రహదారులపై పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు జీవీఎంసీ అధికారులు, పాలకవర్గ సభ్యులు రోజూ ఇదే మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నా వృథాగా పారుతున్న నీటి గురించి కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం దారుణమని పలువురు వాపోతున్నారు. 64, 65 వార్డులకు తాగునీటి సరాఫరా చేసే అధికారులు, పంప్ హౌస్ సిబ్బంది కూడా చూసీ చూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. సుమారు ఆరు నెలలుగా ఇక్కడ తాగునీరు వృథాగా పారుతుండడం శోచనీయం. దీనివల్ల పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్, కొత్తదిబ్బపాలెం ప్రాంతాలకు తాగునీటి సరఫరా సజావుగా సాగడం లేదు. కొళాయిల నుంచి పూర్తి సామర్థ్యంతో నీరు రావడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను జీవీఎంసీ తాగునీటి సరఫరా అధికారులకు, పంప్ హౌస్ ఆపరేటర్ల దృష్టికి తీసుకువెళ్లినా, కార్పొరేటర్లకు వినతిపత్రాలు సమర్పించినా పరిష్కారానికి మాత్రం నోచుకోలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు వృథాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



వృథాగా పారుతున్న నీటితో చిత్తడిగా మారిన రహదారి



బోటుపై వెళ్లేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు.., బోటులో సాగరదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు.. గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు

సాగరగిరి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మల్కాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సముద్రంపై బోటులో విహరిస్తూ వెళ్లే అవకాశం రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. అంతేకాక ఆటోలు, బస్సులలో మరింతమంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బోటు దిగిన వెంటనే బస్సులను ఉచితంగా కొండపైకి చేర్చేందుకు ఆలయ నిర్వాహకులు మూడు ఆటోలను ఏర్పాటు చేశారు. గాజువాక డిపో నుంచి నడిచే 55వ నంబరు బస్సును ఆలయం వరకు పొడిగించారు. అమ్మవారి భక్తుడు మజ్జి సోమేష్ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



ఉక్కు టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన శ్రీమహాదుర్గ



అగనంపూడి పోస్టాఫీసు వద్దనున్న దుర్గమాంబను గాజులతో గాయత్రీదేవిగా అలంకరించిన దృశ్యం



86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో పూజలందుకుంటున్న విజయ దుర్గాదేవి

జగన్మాతా పాహిమాం..

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గమ్మ పలుచోట్ల వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విజయ దుర్గాదేవి అమ్మవారిని మంగళవారం గాయత్రీదేవిగా అలంకరించి 1001 సహస్ర నింబు ఫలార్చనతో పాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, నాయకులు వేగుంట శ్రీనివాసరావు, ఎం.వెంకటసుబ్బయ్య, ఎం.గణపతి, బి.జగదీష్, వెంకటేశ్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు ఎస్టీబీఎల్‌లో పోలమాంబ అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. పూజల్లో జీవీ కృష్ణయ్య, గంగా మహేశ్, చైతన్యకృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు. 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో స్థానిక నాయకులు కేవీఎస్ శంకరరావు, పీబీఎల్ మూర్తి, రాజా, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలోని అమ్మవార్లకు మంగళవారం ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో సహస్ర సంపెంగ పూజలు చేశారు. అలాగే మహా గణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సహిత అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కాగా శ్రీమహాదుర్గ అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా, శ్రీమహాలక్ష్మి అమ్మవారిని శ్రీవిద్యాలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని శ్రీసరస్వతిగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అగనంపూడి: ఇక్కడి పోస్టాఫీసు వద్దనున్న దుర్గమాంబ ఆలయంలోని అమ్మవారిని గాజులతో గాయత్రీదేవిగీ అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు లలిత, విష్ణు సహస్రనామ పారాయణాలను పఠించారు. విజయదశమి వరకు దుర్గమాంబను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు జరుపుతామని ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు. బుధవారం అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పారాయణ సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదమడక కొండపై ఉన్న శ్రీమాతా దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


పెదగంట్యాడ: ఇక్కడి సిద్ధేశ్వరం మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భవానీ భక్తులు అమ్మవారి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉరిటి అప్పలరాజు భవానీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఏపీ ఎన్విరాన్‌మెంట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, టీడీపీ 75వ వార్డు కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య ప్రత్యేక పూజలు చేశారు. ప్రియదర్శనీ కాలనీ, సంజీవగిరి కాలనీ, పెదగంట్యాడ ఆటో స్టాండ్, హెచ్‌బీ కాలనీల్లో గాయత్రీదేవి రూపంలో ఉన్న దుర్గమ్మలకు పూజలు జరిపారు.



పెదగంట్యాడలోని సిద్దేశ్వరంలో గాయత్రీదేవిగా పూజలందుకున్న దుర్గాదేవి

నిండుకుండలా మేహాద్రిగెడ్డ

- 60.2 అడుగులకు చేరిన నీటిమట్టం
- రిజర్వాయర్ నుంచి 1, 058 క్యూసెక్కులు విడుదల



రిజర్వాయర్ నుంచి వరదనీటిని విడుదల చేసిన దృశ్యం

గోపాలపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో ఒక గేటు ఎత్తి 1,058 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా గత నెల కురిసిన వర్షాలకు సెప్టెంబరు మొదటి వారంలోనే 60 అడుగులు దాటింది. దీంతో గేటును ఎత్తి వరద నీటిని విడుదల చేసి నీటిమట్టం 59 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో భారీగా పెరిగి మంగళవారం ఉదయానికి 60.2 అడుగులకు చేరింది. దీంతో రెండో నెంబరు గేటును అడుగున్నర మేర ఎత్తి 1,058 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి నీటిమట్టం 60 అడుగులకు చేరే వరకూ నీటి విడుదల కొనసాగుతుందని రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు. నీటిపారుదల శాఖ ఏఈఈ పి.నళిని, వర్క్ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బరాజు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఈఈ స్వామినాయుడు సూచించారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ

అగనంపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్‌లో మంగళవారం బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమితి సేవా కార్యక్రమాల్లో భాగం ప్రతి వారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తెలిపారు. ప్రతినిధులు లావణ్య, జానకి, పద్మ, శోభారాణి, వెంకటలక్ష్మి, కరణం అర్జునమ్మ, దేవి, తదితరులు పాల్గొన్నారు.



గాజువాక ఎస్టీ కాలనీ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులు

రిటెయినింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

గాజువాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కేబీఆర్ జలాయశయం నుంచి సముద్రతీరం వరకు ఉన్న ప్రధాన గెడ్డ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. భారీ వర్షాల సమయంలో కేబీఆర్ జలాయశం పొంగి ఒక్కసారిగా నీరు సమీపంలోని ఎస్టీ కాలనీ, స్వతంత్ర కాలనీ, తదితర ప్రాంతాలు ముంపునకు గురుతున్నాయి. అయితే కేబీఆర్ జలాశయం నుంచి ప్రధాన గెడ్డ వరకు పూర్తి స్థాయిలో రిటెయినింగ్ వాల్ లేకపోవడంతో భారీ వర్షాల సమయంలో పరిసర ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో గెడ్డకు ఇరువైపులా రిటెయినింగ్ వాల్స్ నిర్మించడం వల్ల వర్షపు నీరు బయటకు పోయే అవకాశం లేదని గతంలో అధికారులు సర్వే చేసి ధ్రువీకరించారు. అందువల్ల ఎస్టీ కాలనీ ప్రాంతం నుంచి ప్రధాన గెడ్డ రిటెయినింగ్ వాల్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ముందుగా ఎస్టీ కాలనీ ప్రాంతం నుంచి నడుపూరు నుంచి గంగవరం పోర్టు వరకు రిటెయినింగ్ వాల్ నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాన గెడ్డకు రెండు వైపులా పూర్తి స్థాయిలో రిటెయినింగ్ వాల్‌ను నిర్మించడం వల్ల భవిష్యత్తులో ముంపు సమస్య ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతో అన్ని వర్గాలకు మేలు

విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక లాభంతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రభావం కర్తవ్యం' అనే అంశంపై మంగళవారం స్టీల్ క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వమే నడపాలని, స్టీల్ ప్లాంట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించటం వల్ల ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సామాజిక ఆర్థిక సమ న్యాయం కోసం నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం వల్ల దేశ భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల వల్లే యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ప్లాంట్ కోసం ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.సత్యం, సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, పరంధామయ్య, సంతోష్‌కుమార్, బాలభాస్కర్, మోహన్‌బాబు, వైటీ దాసు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన తహశీల్దార్



సిద్ధార్థనగర్‌లోని స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్, తదితరులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పదమైన ఆక్రమిత స్థలాన్ని మంగళవారం గాజువాక తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. తొలుత సర్వేయర్‌తో కొలతలు వేయించి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన జాయింట్ సర్వే నిర్వహించాకే తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. 87వ వార్డు కణితిలో సిద్ధార్థనగర్‌ను ఆనుకుని గతంలో చెరువు ఉండేది. దీంతో ఇక్కడ స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని యోచించి గ్రామస్థులు చదును చేయించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ బొండా జగన్ రూ.కోటీ 50 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. అయితే ఈ స్థలం తమదంటూ పలువురు ప్రహరీ నిర్మించడం పట్ల కాలనీవాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. దీంతో తహశీల్దార్ ఈ స్థలాన్ని పరిశీలించారు. సుమారు ఏడు సెంట్ల స్థలం స్టీల్ ప్లాంటుకు చెందిందని సర్వేయర్ జనార్దన్ పేర్కొనగా, ఇదంతా ప్రభుత్వానిదేనని కాలనీవాసులు తెలిపారు. అందుకు స్పందించిన తహశీల్దార్.. జాయింట్ సర్వే చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లక్ష్మీనగర్‌లో కార్డెన్ సెర్చ్

రెండిళ్లలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఓ ఇంట్లోని మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

గోపాలపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 91వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్‌లో గోపాలపట్నం పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు లక్ష్మీనగర్‌లోని ప్రతి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. కాలనీలోని వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో రెండు బెల్టు షాపులను నిర్వహిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు వాటి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ లెంక సన్యాసినాయుడు మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాడీ బిల్డింగ్ పోటీల విజేత హరికృష్ణకు సత్కారం



హరికృష్ణను సత్కరిస్తున్న కూటమి నాయకులు

అగనంపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో స్థానిక బొర్రమాంబ సగర కాలనీకి చెందిన ఉప్పు హరికృష్ణ మంచి ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించి డిసెంబరులో ఢిల్లీలో జరిగే నేషనల్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హరికృష్ణను మంగళవారం టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్‌లు ఘనంగా సత్కరించారు. హరికృష్ణ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డొక్కా రమేశ్, పి.వసంతరావు, సింగిడి సింహాచలం, రాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు ఉమ్మడి వ్యూహం

- ఏపీ, ఒడిశా పోలీసుల కీలక నిర్ణయం
- జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇరు రాష్ట్రాల అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఏపీ, ఒడిశా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి వ్యూహంతో దీనికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆలోచనల మేరకు మంగళవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో రెండు రాష్ట్రాల ఉన్నతస్థాయి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశాన్ని ప్రధానంగా సరిహద్దు సమస్యలను పరిష్కరించేందుకు, సహకార యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి వీలుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీఐజీ, ఇతర అధికారులు వివరించారు. ఏజెన్సీలో గంజాయి సాగు గణనీయంగా తగ్గిందన్నారు. అల్లూరి జిల్లాలో 2021-22లో 7,515 ఎకరాల్లో గంజాయి సాగు చేయగా అది 2024-25 నాటికి 93 ఎకరాలకు తగ్గిందన్నారు. రైతులను అక్రమ సాగు నుంచి దూరం చేయడానికి పోలీసులు 10,817.25 ఎకరాల్లో నాటేందుకు వీలుగా 22 రకాల 4.68 మిలియన్ మొక్కలను పంపిణీ చేసినట్టు వివరించారు. 10,308 గ్రామాల్లోని 35,618 మంది రైతులకు 32,760 కిలోల రాజ్మా విత్తనాలను అందించామన్నారు. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో 30 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు పేర్కొన్నారు. గత మూడేళ్లకు సంబంధించిన శాంతి, భద్రతల వివరాలను రేంజ్ అధికారులు ఒడిశా పోలీసు అధికా రులతో పంచుకున్నారు. గంజాయి రవాణాకు సంబంధించి 2023లో 553 కేసులు నమోదు కాగా, 32,261 కిలోలను స్వాధీనం చేసుకుని, 1,764 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు 393 వాహ నాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 2024లో 652 కేసులు నమోదు చేయగా, 35,062 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 19,41 మంది నిందితులను పట్టుకున్నామని, 483 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది 377 కేసులను నమోదు చేసి, 22,207 కిలోల గంజాయిని, 244 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, 1,038 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి సహకారం, నిబద్ధతతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసేందుకు ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు నిర్ణయించారు. సమావేశంలో కొరాపుట్ డీఐజీ (సౌత్ వెస్టర్న్ రేంజ్) డాక్టర్ కన్వర్ విశాల్‌సింగ్, రాయగడ ఎస్పీ స్వతి ఎస్ కుమార్, కోరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ, మల్కన్‌గిరి ఎస్పీ వినోద్ పాటిల్, ఒడిశాలోని వివిధ సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, ఏపీ నుంచి విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. డీఐజీ గోపీనాథ్ జట్టి చొరవ, దూరదృష్టిని పలువురు అధికారులు ప్రశంసించారు.


జూమ్ మీటింగ్‌లో డీఐజీ గోపీనాథ్ జట్టి, ఏపీ, ఒడిశా అధికారులు

రూ.1.21 కోట్ల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

- 75 కేసుల్లో 103 మంది నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన 75 చోరీ కేసులను ఛేదించిన పోలీసులు 103 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1.21 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆగస్టు నెలలో జరిగిన చోరీకేసులను తమ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో 75 కేసులను ఛేదించారన్నారు. ఆయా కేసుల్లో నేరాలకు పాల్పడిన 103 మందిని అరెస్టు చేసి వారి నుంచి 557.395 గ్రాముల బంగారం, రూ.5.7లక్షలు నగదు, 18 మోటార్‌సైకిళ్లు, 423 సెల్‌ఫోన్‌లు, ఒక టీవీ, 15 కారుటైర్లు, రెండు ఆటో టైర్లు, నాలుగు ఆవులు, రెండు ఎద్దులు, 340 అల్యూమినియం షీట్‌లు సహా రూ.1,21,24,953 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నగరంలో చోరీల నియంత్రణలో భాగంగా 157 అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు రాత్రిపూట ప్రత్యేక పెట్రోలింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటిచర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి చోరీ సొత్తును అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

నేటి నుంచి నగరంలో టీఎన్ఏఐ రాష్ట్ర సదస్సు

ఏపీ నర్సింగ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుశీల

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) ఏపీ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో బుధ, గురువా రాల్లో నర్సింగ్ విద్యార్థుల ద్వైవార్షిక రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్-2025 ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు ఏపీ నర్సింగ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్, టీఎన్ఏఐ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కె. సుశీల తెలిపారు. రాక్‌డేల్ హోటల్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్స్ అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీసి, నాయకత్వాన్ని ప్రోత్స హించేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. టీఎన్ఏఐ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సీఆర్ శంషీర్ బేగం మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థుల రంగోలి, పోస్టర్, సైంటిఫిక్ పేపర్ ప్రజంటేషన్, పెయింటింగ్, మోనో యాక్టింగ్, వ్యాసరచన, నృత్య పోటీలు నిర్వహిస్తామన్నారు. వైద్య రంగంలో నిపుణులు విభిన్న అంశాలపై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె.ఝాన్సీ లక్ష్మీబాయి, డి.ఉషపన్నగవేణి, ప్రొఫెసర్ బి.అనంతమ్మ, కేవీ శ్రీదేవి, కె.పద్మావతి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ ప్రీతం లూక్స్, కో-చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ సుశీల, తదితరులు

సాంకేతికతలో మెడ్‌టెక్ జోన్ ముందంజ

- ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ వైద్య సాంకేతికతలో మెడ్‌టెక్ జోన్ అగ్రగామిగా సాగుతోందని, అనతి కాలంలోనే ఎనలేని ప్రగతి సాధించిందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో, అధికారులతో సమావేశమయ్యారు. ప్రపంచ ఆరోగ్య ఆవిష్కరణలో మెడ్‌టెక్ ముందు వరుసలో నిలవడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు సహాయ పరికరాల ఉత్పత్తి, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం ప్రశంసనీయమన్నారు.కొవిడ్ సమయంలో ఈశాన్య రాష్ట్రాల ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మెడ్‌టెక్ జోన్ వ్యాన్‌లు ముందుకు వచ్చాయన్నారు. ఉపాధి కల్పన, స్టార్టప్‌లను మెరుగుపరచడంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని నూతన ఆవిష్కరణలతో ప్రపంచ వైద్య చరిత్రలో అగ్రగామిగా సాగేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.


మెడ్‌టెక్ జోన్ సీఈవో, అధికారులతో మాట్లాడుతున్న ఒడిశా గవర్నర్ హరిబాబు

నడుస్తుండగా గుండెపోటు

- హరిత జంక్షన్ వద్ద వ్యక్తి మృతి

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని హరిత జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి నడుస్తూ ఉండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పడిపోతున్న వ్యక్తిని చూసిన స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. గుండెపోటు కారణంగా మృతి చెందినట్టు అక్కడి వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచిన పోలీసులు వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.


మృతి చెందిన వ్యక్తి

వ్యక్తిపై కత్తితో దాడి

మహారాణిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపు వద్ద గొడుగు కోసం జరిగిన గొడవ కత్తితో దాడికి దారితీసింది. బౌడారా రోడ్డు సమీపంలో మంగళవారం ఒడిశాకు చెందిన రాకేష్ (31) అనే వ్యక్తి మద్యం దుకాణం వద్దకు వెళ్లాడు. మద్యం తీసుకుని వస్తుండగా అక్కడ ఉన్న గొడుగు కోసం మరో వ్యక్తితో చిన్న పాటి గొడవ జరిగింది. అనంతరం మాటామాటా పెరిగి పరస్పరం నెట్టుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేయడంతో రాకేష్ చేతులు, శరీరంపై గాయాలయ్యాయి. వెంటనే అక్కడి నుంచి నిందితుడు పారిపోయాడు. గాయపడిన రాకేష్‌ను వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. టూటౌన్ ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

వీధి వ్యాపారులపై కక్షసాధింపు మానుకోవాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీధివ్యాపారాలపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. నగరంలో రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో కూల్చివేతను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రధానకార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారని, వారికి శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. తక్షణం నష్టపరిహారం అందజేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మేయర్, కూటమి ప్రజాప్రతినిధులను నగరంలో తిరగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో మళ్ల విజయప్రసాద్, తిప్పలదేవన్, అప్పారావు, విజయ్‌కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, కొండా రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

క్రైం... crime news

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన డి.ముత్యాలు (44) ఎస్ఎంఎస్-1 విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కన్వర్టర్‌లో ఆయిల్ లీకవుతుండడంతో పరిశీలించేందుకు వెళ్లాడు. అదే సమయంలో కన్వర్టర్ పైనుంచి గ్రేసు (కన్వర్టర్‌పై నడిచే భారీ యంత్రం) కదిలి గ్రేస్ హుక్ బలంగా తగలడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


ముత్యాలు మృతదేహం

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మధురవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన మంగళవారం మిథిలాపురి వుడాకాలనీలో జరిగింది. రోడ్డుపై వెళ్తున్న వారిపై రాళ్లతో దాడిచేయడంతో వారంతా భయభ్రాంతులయ్యారు. సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చి జనంపై దాడి చేశా డు. అంతేకాకుండా పార్క్ చేసి ఉన్న కార్లపై రాళ్లు విసరడంతో మూడు కార్ల అద్దాలు పగిలిపోయాయి. దీంతో స్థానికులు అతడిని నియంత్రించడానికి ప్రయత్నించగా రాళ్లు విసిరాడు. పెద్ద బండరాయి పట్టుకుని తిరుగుతుండడంతో కొంతమంది యువకులు చాకచక్యంగా పట్టుకుని డివైడర్‌పై ఉన్న చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పీఎం పాలెం పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


మతిస్థిమితం లేని వ్యక్తిని చెట్టుకు కట్టేసిన దృశ్యం

మహిళల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణంలో) నిరుద్యోగ మహిళలకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా ప్రాంగణాధికారి తెలిపారు. కంప్యూటర్ డేటా ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో రెండు నెలల శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 40 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. రెండు పాస్ పోర్టు ఫొటోలు, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు జిరాక్సు ప్రతులను జతచేసి అక్టోబరు 5 లోగా దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 6281261415, 8333921339 నంబర్లలో సంప్రదించాలన్నారు.